www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -148 శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distirts

## పటిష్ఠమైన రక్షణ అవసరం

**మైనర్ల సోషల్ మీడియా వాడకం...**

**పటిష్ఠమైన రక్షణ అవసరమన్న సుప్రీంకోర్టు**

**మైనర్లు సోషల్ మీడియా ఖాతాలు తెరవకుండా నిషేధించాలని సుప్రీంకోర్టులో పిటిషన్**

**కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఒప్పందాలు చేసుకోలేరని పిటిషనర్ వాదన**

**పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ**

**భారత్‌లో కొన్ని పటిష్ఠమైన రక్షణ చర్యలు అవసరమని చీఫ్ జస్టిస్ వ్యాఖ్య**



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 10:,(ప్రజావినికిడి):** సోషల్ మీడియా ఖాతాల వినియోగం అంశంలో మైనర్లపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం గురువారం నోటీసులు జారీ చేసింది. భారత కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఎటువంటి ఒప్పందాల్లోనూ భాగస్వాములు కాలేరని, అలాంటప్పుడు సోషల్ మీడియా ఖాతాలు తెరిచే సమయంలో ఆన్‌లైన్ ఒప్పందాలను వారు ఎలా అంగీకరిస్తారని పిటిషనర్ ప్రశ్నించారు. **మిగతా 2లో...**

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి



**బీఆర్ఎస్ పై జనాగ్రహంఫ్లాష్ సర్వేలో అదే వెల్లడి..**

**మూడ్రోజుల ఆ పార్టీ తీరుపై ప్రజల్లో అసహ్యం**

**శాసనసభను అడ్డుకొనేందుకు ఫాంహౌజ్‌లోనే కుట్ర**

**ఈ పరిణామాలు మనకే అనుకూలం**

**కుట్రలను సభ్యులంతా ఐక్యంగా తిప్పికొట్టారు**

**పోలీసుల్లో కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డే కనిపించాడుడ అందుకే ఆక్రోశంతో దాడులు**

**వచ్చే రెండేండ్ల మీ పనితీరు అత్యంత కీలకం**

**గెలుపోటములకు అదే గీటురాయి : సీఎల్పీ భేటీలో సీఎం ఏ రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్ సెప్టెంబర్ 10:,(ప్రజావినికిడి):** అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున శాసనసభ ప్రధాన ద్వారం వద్ద, లోపల, బయటా కొనసాగిన పరిణామాలపై బీఆర్ఎస్ నాయకుల తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దీనిపై ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫ్లాష్ సర్వే నిర్వహించామని చెప్పారు. గురువారం హైదరాబాద్ లోని అసెంబ్లీ కమిటీ హాల్ లో ముఖ్యమంత్రి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం వారికి దిశా **మిగతా 2లో...**

## బ్రిక్స్ వైపే అందరి చూపు

**సదస్సుకు సిద్ధమైన ఢిల్లీ**

**నేడు రష్యా, ఇరాన్ అధ్యక్షుల రాక ,మోడీతో ప్రత్యేక భేటీ**




**న్యూఢిల్లీ సెప్టెంబర్ 10,(ప్రజావినికిడి):** భారత్ అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ సమావేశాల వేదికకు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఈనెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాలు, ఆహ్వానిత దేశాల ప్రతినిధులూ పాల్గొననున్నారు. ఈ సదస్సులో ప్రధానంగా ప్రపంచ ఆర్థిక వృద్ధిని మరింత సమ్మిళితంగా మార్చేందుకు అవసరమైన సహకారం, ఆవిష్కరణలు, స్థిరత్వం, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో 18వ బ్రిక్స్ లీడర్స్ సమ్మిట్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ , ఇరాన్ అధ్యక్షుడు **మిగతా 2లో...**

## నేడు బ్యాంక్ ఉద్యోగుల సమ్మె

**పని దినాలు తగ్గించాలి..పలు అంశాలపై ఆందోళన**

**వరుసగా నాలుగురోజుల పాటు స్తంభించనున్న కార్యకలాపాలు**




**హైదరాబాద్ : సెప్టెంబర్ 10: ,(ప్రజావినికిడి):** బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) సెప్టెంబర్ 10 నుంచి దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఐదు రోజుల పనిదినాల అమలు, పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ)లో వివక్ష తొలగింపు తదితర డిమాండ్లపై సెప్టెంబర్‌లో రెండు విడతలుగా సమ్మె చేపట్టనున్నట్టు ప్రకటించింది. ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఇది వరకు హెచ్చరించింది. తొలుత సెప్టెంబర్ 11న ఒకరోజు దేశవ్యాప్త సమ్మె జరగనుందని యూఎఫ్‌బీయూ వెల్లడించింది. **మిగతా 2లో...**

## మండలిలో రసాభాస..

**22ఏ భూములపై చర్చకు డిమాండ్.. బీఆర్ఎస్ వాకౌట్**

**చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు**

**22ఏ భూములపై చర్చకు అనుమతించపోవడంతో వాకౌట్ చేసిన సభ్యులు**

**మార్షల్స్ వ్యవహరించిన తీరుపై మధుసూదనాచారి మండిపాటు**

తెలంగాణ శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై ఈరోజు తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి **మిగతా 2లో...**



## చంద్రబాబు 'వాటర్ మ్యాన్'

**సాగునీటి రంగంలో సీఎం కృషికి దేశం గుర్తింపు: ఆర్థిక మంత్రి పయ్యావుల**

**ముఖ్యమంత్రిని 'వాటర్ మ్యాన్'గా కీర్తించిన 'ఎకనమిక్ టైమ్స్'**

**కలెక్టర్ల సదస్సులో ఈ విషయాన్ని ప్రస్తావించిన మంత్రి పయ్యావుల**

**సాగునీటి రంగంలో కృషికి సీఎం చంద్రబాబుకు స్టాండింగ్ ఓవేషన్**

**డీఎస్సీపై వాస్తవాలు వివరించిన మహిళా అధికారులను అభినందించిన సీఎం**



2లో.

# త్వరలో ఆరు డీఏలు

**ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ**

**ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు**

**పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు**

**ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు**

**ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ**

**హైదరాబాద్ సెప్టెంబర్ 10: ,(ప్రజావినికిడి):** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. **మిగతా 2లో...**



## కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

**మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు**

**కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్**

**అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు**

**భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు**





2లో.

## రూ.250 కోట్ల విలువైన భూమికి రూ.7 కోట్లా?

**బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎక్కడికి పోయాయి**

**సీఎం అన్నదమ్ములకు రూ.వందల కోట్ల విలువైన భూములా.. !**

**ప్రజా సంక్షేమానికి పైసల్లేవా.. దొంగలను పట్టాల్సిన హోంమంత్రి అమిత్ షా ఎక్కడ?**

**ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ మాయాజాలం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి టెస్సరాక్ట్ కంపెనీకి కేటాయించిన భూమి వద్ద బీఆర్ఎస్ నిరసన**




2లో.

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

**మొదటిపేజీ తరువాయి**

నిర్దేశం చేశారు. తమ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఏకరువు పెట్టారు. వాటిని ప్రజలకు వివరించేందుకు వీలుగా పెద్ద ఎత్తున సభను నిర్వహిస్తామని తెలిపారు.అదే సమయంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మూడ్రోజులపాటు జరిగిన బీఆర్ఎస్ నేతల హైడ్రామాపై చేపట్టిన ఫ్లాష్ సర్వేలో అనేక అంశాలు వెల్లడయ్యాయని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తీరు, ఆ పార్టీకి చెందిన సభ్యుల ప్రవర్తనను ప్రజలు అసహ్యించుకుంటున్నారనే విషయం సర్వేలో తేలిందన్నారు. మూడ్రోజుల్లో గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సస్పెన్షన్, లైంగిక వేధింపుల కేసు నమోదు తదితరాంశాలకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నమ్మొద్దని సూచించారు.

పరిస్థితి ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉందని సీఎం వ్యాఖ్యానించారు. శాసనసభ, మండలిలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ్యులు అనుసరిస్తున్న తీరుపై ఆయన ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరగకుండా ఉండేందుకు, సభను అడ్డుకునేందుకు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాం హౌజ్ లోనే కుట్రలు పన్నారని ఆరోపించారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి మూడు రోజులపాటు సభలో గందరగోళం సృష్టించారని గుర్తుచేశారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించటం లాంటి చర్యలతో బీఆర్ఎస్ దుందుడుకు చర్యలు పరాకాష్టకు చేరాయన్నారు. శాసన సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించటం చరిత్రలో ఎప్పుడూ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బందిలో రేవంత్ రెడ్డి కనిపించినట్టు కేటీఆర్ అక్రోశంతో ఊగిపోయిడ వారిపై దాడులు చేయించారని ఎద్దేవా చేశారు. జరిగిన దాడులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను శాసనసభలోపల, బయటా బలంగా తిప్పి కొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు విడమరిచి చెప్పారంటూ ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అభినందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు వీలుగా మూడు రోజులపాటు జరిగిన అన్ని సంఘటనలపై విచారణ చేపట్టామని తెలిపారు.

**చర్చల్లో పాల్గొనండి**

శాసనసభ, మండలిలో జరిగే చర్చల్లో తప్పనిసరిగా పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సభ్యులను ఆదేశించారు. సభలో హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని, అన్ని రోజులూ సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్ లో రాజకీయంగా రాణించలేరంటూ యువ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అప్రమత్తం చేశారు. అందరికీ వెసులుబాటుగా ఉండాలనే ఉద్దేశంతో అత్యంత చారిత్రక భవనంలో శాసన మండలి నిర్వహిస్తున్నామనీ, అసెంబ్లీలో సెంట్రల్ హాల్ ను ప్రారంభించుకుని మాజీ శాసన సభాపతి దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్నామని ఆయన గుర్తుచేశారు. సభల్లో నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించాలని సీఎం సూచించారు. కాంగ్రెస్ నుంచి ఎదిగిన మాజీ మంత్రులు సునీతా లక్ష్మా రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి కాంగ్రెస్ కే నష్టం చేయాలని చూస్తున్నారంటూ తప్పుపట్టారు. తమ పార్టీ అవకాశం ఇవ్వకపోతే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ఆయన ప్రశ్నించారు.

# చంద్రబాబు ‘వాటర్ మ్యాన్’

**సాగునీటి రంగంలో సీఎం కృషికి దేశం గుర్తింపు : ఆర్థిక మంత్రి పయ్యావుల**

**ముఖ్యమంత్రిని ‘వాటర్ మ్యాన్‘గా కీర్తించిన ‘ఎకనమిక్ టైమ్స్‘**



**అమరావత్తి సెప్టెంబర్ 10: ,(ప్రజావినికిడి):**

కలెక్టర్ల కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రశంసల వర్షం కురిపించారు. సాగునీటి రంగంలో చంద్రబాబు చేస్తున్న కృషిని వివరిస్తూ, ప్రముఖ ఆంగ్ల పత్రిక ‘ఎకనమిక్ టైమ్స్‘ ఆయన్ను ‘వాటర్ మ్యాన్‘గా కీర్తిస్తూ కథనం రాసిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు అభినందన సూచకంగా సదస్సులో ఉన్నవారంతా నిలబడి చప్పట్లతో స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా పయ్యావుల మాట్లాడుతూ.. “నీటి వనరుల రంగంలో మనం సాధించిన విజయాలను దేశం గుర్తించింది. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల గురించి ఇతర రాష్ట్రాల్లో చర్చ జరుగుతోంది. ఈ నిశ్శబ్ద పురోగతి వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారు“ అని అన్నారు.

మొదటి కలెక్టర్ల కాన్ఫరెన్సులోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారని, దాని ఫలితంగానే హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లు ఇవ్వగలిగామని వివరించారు. గతంలో పట్టిసీమ ప్రాజెక్టును కొందరు వ్యతిరేకించినా, దాని ద్వారా ఇప్పటివరకు 500 టీఎంసీల నీటిని తరలించగలిగామని, ప్రకాశం బ్యారేజీని 200 సార్లు నింపి డెల్టాకు నీరందించామని పయ్యావుల తెలిపారు. రైతుల కోసం సీఎం పడుతున్న తపనను దేశం గుర్తించిందని, ఆయన సాధించిన విజయమే రాష్ట్ర అభివృద్ధి అని కొనియాడారు.

**మహిళా అధికారులకు సీఎం అభినందన**

ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇద్దరు మహిళా అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలు వివరించారంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, శాప్ ఎండీ భరణిలకు కితాబిచ్చారు. “మనం సమర్థవంతంగా డీఎస్సీని నిర్వహించాం. దానిపై విమర్శలు వస్తే ప్రజలకు వాస్తవాలు వివరించాలి. ఆ బాధ్యతను ఈ మహిళా అధికారులు చక్కగా నిర్వర్తించారు“ అని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

# బ్రిక్స్ వైపే అందరి చూపు

**మొదటిపేజీ తరువాయి**

మసూద్ పెజెష్కియాన్ శుక్రవారమే న్యూఢిల్లీకి చేరుకుంటారని భావిస్తున్నారు. వీరిద్దరూ ప్రధానమంత్రి మోడీతో భేటీ కానున్నారు.

బ్రిక్స్ అనేదిడ గ్లోబల్ సౌత్ దేశాల మధ్య రాజకీయ, దౌత్య, ఆర్థిక సహకారం కోసం ఏర్పడిన అంతర్జాతీయ సమన్వయ వేదిక. దీనికి ప్రత్యేక రాజ్యాంగ ఒప్పందం, సొంత బడ్జెట్ లేదా శాశ్వత సెక్రటేరియట్ లేవు. బ్రిక్స్ సహకారం ప్రధానంగా మూడు విభాగాలుడరాజకీయ, భద్రతా సహకారం, ఆర్థిక రంగ సహకారం, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాల చుట్టూ కొనసాగుతుంది. ప్రస్తుతం బ్రిక్స్‌లో 11 పూర్తి సభ్య దేశాలు ఉన్నాయి.

**నాలుగోసారి బ్రిక్స్ అధ్యక్షత బాధ్యతలు చేపట్టనున్న భారత్**

2026 జనవరి 1 నుంచి భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టింది. అయితే భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడం ఇది నాలుగోసారి. గతంలో 2012, 2016, 2021 సంవత్సరాల్లోనూ భారత్ ఈ బాధ్యతలను నిర్వహించింది. అంతేకాకుండా 2026వ సంవత్సరం బ్రిక్స్ ఏర్పాటై 20 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది

**2024 కజాన్ సదస్సులో బ్రిక్స్‌లో (పార్ట్నర్ కంట్రీ కేటగిరీ ఏర్పాటు**

2024 కజాన్ సదస్సులో బ్రిక్స్‌లో పార్ట్నర్ కంట్రీ కేటగిరీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ విభాగంలో బెలారస్, బొలీవియా, క్యూబా, కజకిస్తాన్, మలేషియా, నైజీరియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్తాన్, వియత్నాం ఉన్నాయి. భాగస్వామ్య దేశాలను సాధారణంగా నేతల సదస్సుకు ఆహ్వానిస్తారు. సభ్య దేశాల ఏకాభిప్రాయం ఉన్న సందర్భాల్లో ఇతర బ్రిక్స్ సమావేశాల్లోనూ వీరు పాల్గొనే అవకాశం ఉంటుంది.

**విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు**

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో భారత ప్రభుత్వం, భారత భద్రతా బలగాలు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సదస్సు సమయంలో అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఢిల్లీ విమానాశ్రయ నిర్వాహక సంస్థ పలు కఠినమైన చర్యలను అమలు చేస్తోంది. తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 500 సీసీటీవీ కెమెరాల సహాయంతో, భద్రతా ఏర్పాట్లను సీసీటీవీ కంట్రోల్ రూమ్ పర్యవేక్షిస్తుంది. ఈ కంట్రోల్ రూమ్ పరిధిలో న్యూఢిల్లీ జిల్లాలోని కీలకమైన రహదారులలో సగం భాగం, అలాగే విదేశీ అతిథులు బస చేయనున్న ఆబ్రే హోటల్ , తాజ్ మాన్ సింగ్ హోటల్ వంటి ప్రాంతాలు ఉంటాయి.అదే విధంగా సమగ్ర భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలు, ఎన్ఎస్‌జీ, ఇతర ఏజెన్సీలకు చెందిన సుమారు 7,000 మంది సిబ్బందిని మోహరించారు. అలాగే వివిధ ప్రాంతాలలో ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలు, ఎన్ఎస్‌జీ, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎస్పీజీ సిబ్బందితో కూడిన బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

**బ్రిక్స్ సదస్సు ప్రధాన ఎజెండా**

గ్లోబల్ సౌత్: అంతర్జాతీయ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను, ప్రాతినిధ్యాన్ని బలంగా వినిపించడంపై భారత్ ప్రధానంగా దృష్టి సారించనుంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ : డిజిటల్ చెల్లింపులు, డిజిటల్ సేవల రంగంలో భారత ప్రభుత్వం సాధించిన విజయాలను, జ్ఞానాన్ని ఇతర బ్రిక్స్ దేశాలతో పంచుకోవడం. వాతావరణ మార్పు లు, ఇంధన పరివర్తన: పునరుత్పాదక శక్తి, ఇంధన భద్రత, స్థిరమైన సాంకేతికతలపై సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడం. మల్టీలేటరల్ సంస్థల సంస్కరణలు: ఐక్యరాజ్యసమితి, ఐఎంఎఫ్ వంటి ప్రపంచ ఆర్థిక, పాలనా సంస్థల్లో వర్ధమాన దేశాలకు సరైన ప్రాతినిధ్యం దక్కేలా సంస్కరణలు తీసుకురావడంపై చర్చలు.

# రూ.250 కోట్ల విలువైన భూమికి రూ.7 కోట్లా?

**రంగారెడ్డి సెప్టెంబర్ 10: ,(ప్రజావినికిడి):**

సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి రూ.250 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ‘ఈడీ, ఐటీ, సీబీఐలు మాపై కేసులు పెట్టడానికే ఉన్నాయా? అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు కనిపించడం లేదా’ అని నిలదీశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రాంతంలో కొండల్ రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిన భూములను గురువారం కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ‘తెలంగాణ ఏటీఎంగా మారిందని ప్రధాని చెబుతున్నారు. మరి తెలంగాణను కొల్లగొడు తున్నారని ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన హోంమంత్రి ఎక్కడున్నారుడ? ఇంత పెద్ద వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు’ అని ప్రశ్నించారు. సీఎం కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం అధికార దుర్వి యోగం కాదా, ప్రయోజనాల సంఘర్షణ కాదా, కుటుంబ పాలన కాదా అని ఆయన నిలదీశారు. ఎనుముల జగదీశ్వర్‌రెడ్డికి సంబంధించిన సంస్థకు రూ.1,000 కోట్ల పెట్టుబడి పేరుతో ప్రభుత్వ రాయితీలు, భూము లు, మినహాయింపులు కల్పించే వ్యవహా రంపైనా ప్రశ్నలు సంధించారు.

సీఎం సోదరుడి సంస్థ ఇజ్రాయిల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌తో చేసుకున్న ఒప్పందంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు లోబడి ఉంటాయని అన్నారు. ఈ రంగంలోనూ అధికారానికి దగ్గరగా ఉన్న కుటుంబాలకు ప్రయోజనాలు కల్పిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలు కూడా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలోకి రావడంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. శాసనసభలో ఈ భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తామనే తమను సస్పెండ్ చేసి బయటకు పంపారని ఆరోపించారు. అందుకే మీ తమ్ముడికి ఇచ్చిన భూమి వద్దకే వచ్చామని, ఇక్కడి నుంచే ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నామని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాయా జాలం నడుపుతున్నదని ఆరోపించారు. గతంలో ఫార్మాసిటీ కోసం నిర్దిష్ట షరతులతో భూసేకరణ జరిగిందని, ఆ భూములను ఇప్పుడు ఇతర కార్యకలాపాలకు వినియోగిం చడం చట్టపరంగా ప్రశ్నార్థకమని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పేరుతో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలు ఈ న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

**హైదరాబాద్ సెప్టెంబర్ 10:,(ప్రజావినికిడి):**

తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

వివరాల్లోకి వెళితే.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ-షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు.

ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# పటిష్ఠమైన రక్షణ అవసరం

**మొదటిపేజీ తరువాయి**

జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై సమాధానమివ్వాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ, న్యాయ శాఖలను ఆదేశించింది. ‘జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్‘ అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. విచారణలో భాగంగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫూల్కా వాదనలు వినిపిస్తూ, అమెరికాలో 13 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.ఈ వాదనలతో ఏకీభవించిన జస్టిస్ సూర్యకాంత్, “భారత్‌లోనూ ఇటువంటి రక్షణ చర్యలు అవసరం ఉంది“ అని వ్యాఖ్యానించారు. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ బాగ్చి స్పందిస్తూ నియంత్రణ కోసం పటిష్ఠమైన ‘ఫైర్‌వాల్స్‘ ఉండాలని అభిప్రాయపడ్డారు.మైనర్లు సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించడం వల్ల ఆన్‌లైన్ గ్రూమింగ్, లైంగిక వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి ముప్పులను ఎదుర్కొంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియా సంస్థలు వయసు నిర్ధారణ కోసం పటిష్ఠమైన యంత్రాంగాన్ని అనుసరించేలా, మైనర్లు సొంతంగా ఖాతాలు తెరవకుండా నిరోధించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాగా, తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండే ఖాతాల ద్వారా విద్యా సంబంధిత కంటెంట్‌ను వీక్షించేందుకు అనుమతించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

# నేడు బ్యాంక్ ఉద్యోగుల సమ్మె

**మొదటిపేజీ తరువాయి**

ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం సాధారణ సెలవులు. ఇక సోమవారం వినాయక చవితి కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. ఈ ఆందోళనతో కేంద్రం స్పందించకపోతే, డిమాండ్‌లను పరిష్కరించకపోతే తిరిగి సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో వరుసగా మూడు రోజుల సమ్మె చేపట్టనున్నట్లు ఇటీవల వెల్లడించింది. అయినప్పటికీ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని యుఎఫ్‌బియు తీవ్రంగా హెచ్చరించింది.

బ్యాంకులకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలని యూఎఫ్‌బీయూ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. 2024 మార్చి 8న కుదిరిన 12వ ద్వైపాక్షిక వేతన ఒప్పందంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) అంగీకరించిందని గుర్తు చేసింది. వారానికి ఐదు రోజుల పనిదినాల అమలుకు బదులుగా సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు అదనంగా 40 నిమిషాలు పనిచేసే విధానాన్ని ప్రతిపాదించినప్పటికీ.. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు తుది నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ)లో ఉద్యోగులు, అధికారుల మధ్య వివక్ష చూపుతున్నారని యూఎఫ్‌బీయూ ఆరోపించింది. ఈ వ్యత్యాసం ఉద్యోగుల్లో అసంతృప్తికి దారితీస్తోందని.. పీఎల్ఐ విధానాన్ని సమీక్షించి సమానత్వం తీసుకురావాలని డిమాండ్ చేసింది

# మండలిలో రసాభాస..

**మొదటిపేజీ తరువాయి**

చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ, ముందస్తు ఎజెండా ప్రకారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.

ఈ క్రమంలో సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతలు శాంతించలేదు. ప్రభుత్వం చర్చకు భయపడుతోందని ఆరోపిస్తూ సభ జరుగుతున్న తీరుకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులందరూ మండలి నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు.

వాకౌట్ అనంతరం మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ... శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధుల హక్కులను భంగపరిచేలా మార్షల్స్ వ్యవహరించడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.

# త్వరలో ఆరు డీఏలు

**మొదటిపేజీ తరువాయి**

తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు ‘తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్’ (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు.ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో ప్రముఖ రియల్టర్ ఆత్మహత్య

**రంగారెడ్డి సెప్టెంబర్ 10,(ప్రజావినికిడి):**

హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, హోమ్ ల్యాండ్ సంస్థ అధినేత రామ్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కందుకూరు మండలం నెదునూరు గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆయన బలవన్మరణం చెందారు.

రామ్ రెడ్డి పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు 280 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొందరు రాజకీయ నాయకుల నుంచి ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ ఒత్తిళ్లను తట్టుకోలేకే ఆయన ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో ఆహారం పంపిణీ



**నాంపల్లి, (ప్రజావినికిడి):**
తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సైనీ (ముజీబ్),ట్రస్ట్ ట్రెసరర్ అసద్దుద్దీన్, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తన సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు.ఇందులో భాగంగా గురువారం ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు,వారి వెంట ఉన్న సహాయకులకు డాక్టర్ ముజీబ్ తన స్వహస్తాలతో ఆహారాన్ని పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులైన ఆసదుద్దీన్, అన్వరున్నీసా స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ ట్రస్ట్ ద్వారా డాక్టర్ ముజీబ్ ప్రతి వారం ఆసుపత్రిలో రోగులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ, నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు కడుపునిండా భోజనం పెట్టడం కంటే గొప్ప తృప్తి మరొకటి లేదు. సమాజం కోసం కొంతైనా తిరిగి ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలు చేపడుతున్నాను. యూనియన్ నాయకులు, సభ్యులందరూ కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం నాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుంది. కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టి.ఎన్.జి.ఓ.ఎస్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్,వైస్ ప్రెసిడెంట్ బోలిగిద్ద శంకర్, ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆస్పత్రి యూనిట్ ప్రెసిడెంట్ బి.శివకుమార్, కార్యదర్శి చంద్ర శేఖర్, హైదరాబాద్ జిల్లా ఏ.పీ.ఆ.ర్వో మహ్మద్ వహీద్, మహ్మద్ ముస్తఫా, మహ్మద్ హబీబ్ చావుష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి ఐలమ్మ వర్ధంతి



**అంబర్ పేట్, (ప్రజావినికిడి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా సిపిఎం పార్టీ అంబర్ పేట్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ ఆఫీసులో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్ మాట్లాడుతూ, నిజాం సర్కార్ వ్యతిరేకంగా వీరనారి చిట్యాల ఐలమ్మ చేసిన పోరాటం గొప్ప స్ఫూర్తిదాయకమని తన పంటను కాపాడుకోవడం కోసం ఇసునూరు రామచంద్రారెడ్డి గుండాలను తరిమికొట్టి తన పంటను కాపాడుకుంది. తను చేసిన పోరాట స్ఫూర్తి తో చుట్టూ పక్కల ఉన్నటువంటి వ్యవసాయ కూలీలు రైతులు ఆమెకు అండగా నిలబడి ఆమె పోరాటంలో పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా భూస్వాములకు, జమీందారులకు రజాకార్లకు, వ్యతిరేకంగా పోరాటం చేసి జమీందారు దగ్గర భూములు గుంజి నాలుగువేల గ్రామాల్లో ప్రజానీకానికి 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసి నిజాం సర్కార్ను మెడలు వంచి తరిమి కొట్టారని గుర్తు చేశారు. సబ్బండ వర్గాలు కులాలకు అతీతంగా మతాలకతీతంగా ప్రాంతాలకు అతీతంగా నిజాం సర్కార్కు వ్యతిరేకంగా కలిసి పోరాటం చేసి తమ హక్కులు సాధించుకున్నారని భూమి కోసం భక్తి కోసం వ్యక్తి వెట్టి చాకిరి కోసం జరిగిన పోరాటం, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని,కానీ ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఈ పోరాటాన్ని మతకోణంలో చూస్తూ ఇది హిందువులు ముస్లిం రాజు మీద గెలుపుగా చిత్రీకరిస్తూ ప్రజల తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.ఇది హిందూ ముస్లిం ఘర్షణ కాదని పేదలు వ్యవసాయ కూలీల యొక్క వేట్టిచాకి వ్యతిరేకంగా జరిగిన పోరాటమని తెలిపారు. హిందూ ముస్లిం పోరాటమైతే షేక్ బందగిని, మొదట చంపింది నిజాం సర్కార్ అని,పత్రికా విలేకరి సోహెబుల్లా ఖాన్,చంపింది నిజాం సర్కారని జమీందారులకు భూస్వాములకు వ్యతిరేకంగా చేరిన పోరాటంలో రసాకర్ల తూటాకు బలైన మొదటి వ్యక్తి దొడ్డి కొమరయ్య,అని ఈ పోరాటంలో నిజాం నిరంకుశత్వానికి హిందువులు ముస్లింలు అనగారిన వర్గాలు,పేదలు వ్యవసాయ కూలీలు అందరూ బలయ్యారని పేర్కొన్నారు.ఈ పోరాటస్ఫూర్తితో భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు,ఒకటై తమ హక్కుల సాధించుకోవాలని,ఈనెల17వ తేదీన జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ అంబర్పేట జోన్ కమిటీ సభ్యులు జి రాములు,బి సుబ్బారావు, సోమయ్య, కార్మిక నాయకులు సురేష్ నాయక్, ధర్మ నాయక్, తిరుపతి, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

# బొబ్బిలి చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్,కమిషనర్..



**షాద్ నగర్, (ప్రజావినికిడి):** పురపాలక సంఘం పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను చైర్మన్,కమిషనర్ బొబ్బిలి చెరువు వద్ద పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే భక్తులకు,గణేష్ విగ్రహాల ఊరేగింపులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. చెరువు వద్ద పారిశుద్ధ్య నిర్వహణ,తాగునీరు,విద్యుత్, లైటింగ్,భద్రతా చర్యలు,ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పరిశీలించారు.గణేష్ నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్మన్,కమిషనర్ లు సూచించారు.ప్రజలు భక్తులు అధికారులకు సహకరిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సంబంధిత పురపాలక అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భగవంతుని కృప లేనిదే ఆయన సన్నిధి చేరలేం

## ఆల్ మేజర్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఫయాజ్ అలీ






**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 10,** భగవంతుని దర్శించుకోవాలంటే దైవ అనుగ్రహం ఎంతో కీలకమనిక ఆల్ మేజర్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఫయాజ్ అలీ అన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి సౌదీ ఎయిర్లైన్స్ విమానంలో 52 మందితో కూడిన ఉమ్రా యాత్రికుల బృందం పవిత్ర మక్కా మసీదులను నగర సందర్శనానికి బుధవారం బయలుదేరారు. ప్రముఖులతో కూడిన ఈ బృందానికి మహమ్మద్ ఫయాజ్ అలీ ప్రత్యేక వసతులు కల్పించారు. పవిత్ర మక్క మదీనా నగరాలను సందర్శించేందుకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఇస్లామిక్ మతస్తులు బయలుదేరారు. విమానాశ్రయం వద్ద యాత్రికులకు వారి కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ఆల్ మేజర్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ, సర్వశక్తివంతమైన అల్లా భగవంతుడు అపారమైన కృప ఆహ్వానం లేనిదె ఎవరు అయినా పవిత్ర సన్నిధిని చేరుకోలేరని మతపెద్దలు స్పష్టం చేశారు. మక్కా మదీనా వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలు దర్శించుకోవాలంటే అక్కడ ప్రార్థనలు చేయాలంటే దైవ అనుగ్రహం ఎంతో కీలకమని అన్నారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వైద్యులు ఇంజనీర్లు సాఫ్ట్వేర్ ఉద్యోగులు వ్యాపారవేత్తలు యాత్రలో పాల్గొంటున్నారని సూచించారు. వీరంతా పవిత్రమైన మక్కాలో దాదాపు 15 రోజులతో పాటు ప్రత్యేక ఉపాసన దీక్షలు నిరంతరం దైవ చింతనతో ప్రార్థనలు చేస్తున్నట్లు వెల్లడించారు దైవ దర్శనానికి వెళుతున్న యాత్రికులకు ఎలాంటి చిన్న అసౌకర్యం కలవకుండా వారి ప్రార్థనలకు ప్రశాంతంగా వాతావరణం ముగిసేలా తమ బృందం క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తుందని అన్నారు.

# సైక్లింగ్ ట్రాక్‌తో ట్రాఫిక్ తిప్పలు

**మెట్టుగూడ-తార్నాక సీసీఎంబీ వరకు రోడ్డుకు ఇరువైపులా తొలగించాలంటున్న వాహనదారులు**

**సాయంత్రం వేళ నరకప్రాయంగా మారుతున్న రాకపోకలు.. ట్రాక్‌ను అడ్డుపెట్టుకుని వ్యాపారుల ఆక్రమణలు**







**హైదరాబాద్,(ప్రజావినికిడి):** నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, కొన్ని ప్రాంతాల్లో తీసుకుంటున్న నిర్ణయాలు వాహనదారులకు మరింత ఇబ్బందిగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మెట్టుగూడ నుంచి తార్నాక సీసీఎంబీ వరకు ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్ ప్రస్తుతం వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ పెరిగినప్పుడు రోడ్డు చాలక ట్రాఫిక్ నెమ్మదించడంతో పాటు వాహనదారులు ట్రాక్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.

### రోడ్డు చాలక.. ట్రాక్‌లోకి వాహనాలు

మెట్టుగూడ నుంచి తార్నాక మీదుగా సీసీఎంబీ వరకు ప్రధాన రహదారిపై రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో వాహనాలు బారులు తీరుతున్నాయి. రహదారి అందుబాటులో ఉన్న స్థలం తగ్గిపోవడంతో కొందరు వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో సైక్లింగ్ ట్రాక్‌లోకి వెళ్లాల్సి వస్తోందని వాహానాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సైక్లిస్టులకు ఉద్దేశించిన ట్రాక్ సైకిల్ నడచేవారు లేక రోడ్డు తో ప్రయోజనం లేకుండా పోతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ట్రాక్‌కు అడ్డుగా వ్యాపారుల ఆక్రమణలు

మరోవైపు సైక్లింగ్ ట్రాక్‌ను అడ్డుపెట్టుకుని కొందరు వ్యాపారులు తమ కార్యకలాపాలను విస్తరించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ట్రాక్ పరిసరాల్లో వాహనాల నిలిపివేత, వ్యాపార సామగ్రి ఏర్పాటు తదితర కారణాలతో వాహానాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ట్రాక్ లక్ష్యం సైక్లిస్టులకు సురక్షిత మార్గం కల్పించడమే అయినప్పటికీ సైకిల్ నడిపేవారు లేకపోవడంతో ట్రాఫిక్‌కు అదనపు ఇబ్బందిగా మారిందని వాహానాదారులు పేర్కొంటున్నారు.

### హబ్సిగూడ-ఉప్పల్‌లో తొలగించడంతో ట్రాఫిక్ కష్టాలు తగ్గాయి

హబ్సిగూడ చౌరస్తా నుంచి ఉప్పల్ వరకు సైక్లింగ్ ట్రాక్ తో ఎలాంటి ఉపయోగం లేకపోగా వాహానాదారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందని ఎం ఎం సి కమిషనర్ పరిశీలించి తొలగించడంతో ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గిందని వాహనదారులు గుర్తుచేస్తున్నారు. అదే తరహాలో మెట్టుగూడ నుంచి తార్నాక సీసీఎంబీ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సైక్లింగ్ ట్రాక్‌ను తొలగించి రహదారి వెడల్పును పెంచాలని కోరుతున్నారు.

### జోనల్ కమిషనర్ స్పందించాలి

సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్ ఈ అంశంపై వెంటనే దృష్టి సారించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి,ట్రాక్ వల్ల ట్రాఫిక్‌కు అవరోధంగా మారిందా.? అనే విషయాన్ని పరిశీలించి అవసరమైతే వెంటనే ట్రాక్‌ను తొలగించి రహదారి వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సూచిస్తున్నారు. హైదరాబాదులోట్రాఫిక్ కష్టాలతో ప్రతిరోజూ అవస్థలు పడుతున్న వాహనదారుల విజ్ఞప్తిపై జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు ఇకనైనా స్పందిస్తారా.? లేక ట్రాఫిక్ జామ్‌లను చూస్తూ మౌనం వహిస్తారా అనేది వేచి చూడాలి.

# తెలంగాణ సచివాలయంలో ఏసీబీ దాడులు

## రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుకు రూ.లక్ష లంచం..

**హైదరాబాద్, (ప్రజావినికిడి) :**
తెలంగాణ సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన ట్రాప్ కలకలం రేపింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.2 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెక్కును ఇప్పించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు అందిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. సచివాలయ ఆవరణలోని దేవాలయం సమీపంలో లంచం తీసుకుంటుండగా ఓ ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ లంచం తీసుకోవడంలో మరో ఉద్యోగి హస్తం కూడా ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వారిద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు.



సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కు కోసం బాధితుడు సంబంధిత ఉద్యోగులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో చెక్కును అందించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించినట్లు సమాచారం. ఇందులో భాగంగా సచివాలయ ఆవరణలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఉద్యోగిని అధికారులు పట్టుకున్నట్లు తెలుస్తోంది.
ఈ కేసులో సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ విభాగానికి సంబంధించిన సెక్షన్ ఆఫీసర్ వినోద్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మొదటి విడతగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్ర రూ.5 వేల నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మిగిలిన మొత్తంలో భాగంగా రూ.లక్ష తీసుకునే సమయంలో సీనియర్ అసిస్టెంట్/సెక్షన్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగి ఏసీబీ ట్రాప్‌లో చిక్కినట్లు తెలుస్తోంది.ఈ లంచం వ్యవహారంలో ఎవరి ఆదేశాల మేరకు డబ్బులు డిమాండ్ చేశారు. ఇంకా ఎవరైనా ఉద్యోగులు, అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారా అనే కోణాల్లో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.ట్రాప్ తర్వాత ఏసీబీ అధికారులు సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన విభాగంలో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాధితుడి దరఖాస్తు, సీఎంఆర్ఎఫ్ మంజూరు ప్రక్రియ,చెక్కు విడుదలకు సంబంధించిన ఫైళ్లు,ఉద్యోగుల పాత్రపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్ వెనుక మరెవరైనా రెగ్యులర్ అధికారులు ఉన్నారా అనే అంశంపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ట్రాప్‌లో పట్టుబడిన ఇద్దరు ఉద్యోగులను నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, డబ్బుల లావాదేవీలు, సీఎంఆర్ఎఫ్ ఫైల్ ప్రాసెసింగ్‌లో వారి పాత్ర వంటి అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన కార్యాలయమైన సచివాలయంలోనే సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం తీసుకుంటూ ఉద్యోగులు పట్టుబడినట్లు వార్తలు రావడం ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీసింది. పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన ప్రక్రియలో లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది

# క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

## ఆధునిక సాంకేతికతతో మరింత ఖచ్చితమైన చికిత్స - సీనియర్ శస్త్ర చికిత్స నిపుణుడు డా.రాజేష్ గౌడ్

## హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో షాద్ నగర్ లో విలేకరుల సమావేశం




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**క్యాన్సర్ శస్త్రచికిత్స రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని సీనియర్ శస్త్ర చికిత్స నిపుణుడు,రోబోటిక్ శస్త్ర వైద్యుడు డా.రాజేష్ గౌడ్ అన్నారు.క్యాన్సర్‌ను తొలగించడంతో పాటు రోగి జీవన నాణ్యతను కాపాడటమే ఆధునిక చికిత్సల ప్రధాన లక్ష్యమని తెలిపారు.హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్‌లోని దేవి గ్రాండ్ సమావేశ హాల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంలో క్యాన్సర్ చికిత్సలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.రోబోటిక్ శస్త్రచికిత్స ద్వారా చిన్న రంధ్రాల ద్వారా ఆపరేషన్లు నిర్వహించే అవకాశం ఉండటంతో రోగులకు తక్కువ నొప్పి,తక్కువ రక్తనష్టం,చిన్న మచ్చలు,త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.మహిళల్లో గర్భాశయ, అండాశయ క్యాన్సర్లతో పాటు రొమ్ము క్యాన్సర్ చికిత్సలోనూ ఆధునిక పద్ధతులు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ప్రోస్టేట్, మూత్రాశయ, మూత్రపిండాల క్యాన్సర్ల చికిత్సలోనూ రోబోటిక్ శస్త్రచికిత్సలు కీలకంగా మారుతున్నాయని అన్నారు. మూత్రపిండ క్యాన్సర్‌లో కణితి ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి ఆరోగ్యకరమైన భాగాన్ని కాపాడే అవకాశం ఉంటుందని వివరించారు. పెద్దపేగు,మలద్వార,ఊపిరితిత్తుల క్యాన్సర్ల చికిత్సలోనూ చిన్న కోతలతో శస్త్రచికిత్సలు నిర్వహించే ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.ప్రత్యేక కాంతి సహాయంతో క్యాన్సర్ ప్రభావిత కణజాలం,శోషరస మార్గాలను గుర్తించే సాంకేతికతతో శస్త్రచికిత్సల్లో మరింత ఖచ్చితత్వం సాధించే అవకాశం ఉందన్నారు.కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతికతలతో భవిష్యత్తులో క్యాన్సర్ చికిత్స మరింత సమర్థవంతంగా మారుతుందని డాక్టరు పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆసుపత్రి ప్రతినిధులు లలిత్ శర్మ, దయశ్వర్ తదితరులు ఉన్నారు.

# ఘనంగాచాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు..




**నాగోల్,(ప్రజావినికిడి):**
చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగాఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మామిళ్ళ సాయికుమార్ బండ్లగూడ గ్రామ రజక సంఘం జనరల్ సెక్రెటరీ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,తెలంగాణ అగ్ని కణం చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పాత్ర మరువ లేనిది భూమికోసం భుక్తి కోసం విముక్తి కోసం సాగిన పోరులో ఆమె కీలక పాత్ర పోషించారు. బందుకు చేతబట్టి దొరల గుండెల్లో సింహ స్వప్నం గర్జించారు.రోకలి బండ చేతబూని దోపిడి దొంగల ను ఉడికించిన ఐలమ్మ.. భూస్వాములపై తిరగబడ్డారు. పోరు దారిలో అయినవాళ్లను అందరికి అయినదానిలా నిలిచారు.

# దొరల పెత్తనాన్ని ధిక్కరించిన ధీరవనిత చాకలి ఐలమ్మ..!

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే**

**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తి చిరస్మరణీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు వేసిఘనంగానివాళులర్పించారుఈ సందర్భంగా ఐలమ్మ చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారుసామాజిక వివక్ష,



వెట్టి చాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్



చైర్మన్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్లు మున్సిపల్ వార్డు సభ్యులు. కోఆప్షన్ సభ్యులు.రజక సంఘం తాలూకా నాయకులు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళు లర్పించారు.

# కొలన్ సులోచన మృతికి సురేష్ రెడ్డి,మంత్రి సత్యనారాయణ సంతాపం



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి, కీ.శే.కొలన్ సులోచన నిన్న అకాల మరణం చెందడంతో, గురువారం ఆయన నివాసానికి పలువురు ప్రముఖులు విచ్చేసి సంతాపం తెలిపారు.ఈ సందర్భంగాసుభాష్ నగర్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అలాగే సూరారం మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ కొలన్ హన్మంత్ రెడ్డి ని పరామర్శించి, సులోచనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.సులోచన మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారుఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# డంపింగ్ యార్డుతో ప్రజల జీవితాలు విధ్వంసమే..!

**డంపింగ్ యార్డు రద్దు కొరకు ఐక్యంగా పోరాడుదాం..।**

**హైదరాబాద్ బషీర్ భాగ్ లో జరిగిన కార్యక్రమంలో మరియు పర్యాయవరణ వేత్తలు, మేధావులు..**




**షాద్ నగర్, (ప్రజావినికిడి ):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ హైదరాబాద్ బషీర్ బాగ్ లో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యావరణ వేత్తలు, మేధావులు పి,వివిధ రాజకీయ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ఈ డంపింగ్ యార్డు రద్దు కొరకు పోరాడాలని ఐక్యంగా తీర్మానం చేశారు. ఈ సమావేశానికి డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ రాంబల్ నాయక్ మరియు తెలంగాణ సమాఖ్య చైర్మన్ కరుణాకర్ దేశాయ్ లు అధ్యక్షత వహించగా జాక్ కన్వీనర్ పినపాక ప్రభాకర్, కో ఆర్డినేటర్లు తిరుమలయ్య , టీజీ శ్రీనివాస్ లు సమన్మయ కర్తలుగా వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వాలు ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ కంపెనీల కోసం పనిచేస్తున్నాయని , ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇంటింటికీ తిరిగి హామీలిస్తూ ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాయి. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి తమ స్వార్థ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయని అన్నారు.

ఇప్పటికే ప్రభుత్వం దగ్గర చెత్త నిర్వహణకు సరైన విధానం లేదని, డంపింగ్ యార్డు వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయం మొత్తం దెబ్బతిని పోతుందని,పచ్చని పంట పొలాలు మద్యాన ఏర్పాటు చేయడం మూర్ఖత్వపు చర్యగా అభివర్ణించారు, పేద ప్రజల జీవితాలను విధ్వంసం చేసేందుకు రకరకాల ప్రాజెక్టులు అభివృద్ధి పేరిట వాళ్ల సంపాదన పెంచుకుంటున్నారు అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

సిద్దాపూర్ ఏర్పాటు చేయటం ద్వారా ఆ డంపింగ్ యార్డు లో దుర్వాసన దుర్గంధం చెత్తనుండి విడుదలయ్యే లిచీ ద్వారా భూగర్భ జలాలు మొత్తం కలుషితం అవుతుంది. చెరువులు కాలుష్యం భారిన పడతాయని పతానీకరణ పల్లెలను నాశనం చేస్తాయి. ఏవో టౌన్ పేరుతో తీస్తున్న డంపింగ్ యార్డు ఒక బూటకం . ఎక్కడా అలాంటి ప్రయోగాలు విజయవంతం కాలేదు. ప్రకృతిని కాపాడుకోవాలని ప్రకృతిని విధ్వంసం చేస్తే మానవ మనుగడ కొనసాగదని తెలిపారు.

డంపింగ్ యార్డు వల్ల మానవ మనుగడ తో పాటు సకల జీవ రాశులకు ప్రమాదం పొంచివుంది. ఈ డంపింగ్ యార్డు కు వ్యతిరేకంగా జరిగే నష్టాలను చర్చించి అందరినీ ఉద్యమంలోకి సమీకరించి , ఉద్యమంలో మహిళలను యువకులను కీలకంగా వ్యవహరించే విధంగా చైతన్యం కలిగించేలా చూడాలని, అందరం ఐక్యంగా నిలబడి డంపింగ్ యార్డు ఏర్పాటు కు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రజలు డిమాండ్ చేస్తున్నటువంటి ఉపాధి ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలు మరియు సాగునీటి ప్రాజెక్టులు కాకుండా కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా ప్రభత్వ విధానాలు రూపొందిస్తున్నారని, సిద్దాపూర్ మరియు పరిసర గ్రామాల ప్రజలు ఒంటరిగా లేరని మేమందరం మీకు అండగా ఉన్నామని అందరం కలసి ఇలాంటి డంపింగ్ యార్డులను ప్రజలకు నష్టం చేకూర్చే పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడుదామని సంఘీభావం తెలిపారు.




ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్తలు ప్రో బీవీ సుబ్బారావు, ప్రో బాబురావు ప్రో పిట్టల రవి ,ప్రో దొంతి నరసింహ రెడ్డి,ప్రో విజయ్ , ఎంవీ రెడ్డి ఐఏఎస్ మాజీ కలెక్టర్,మాజీ శాసన సభ్యులు అంజయ్య యాదవ్, సిపిఐ ఎంఎల్సీ నెల్లికంటి సత్యం , ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్య, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు జ్యోతి, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు అంబటి నాగయ్య, టీజేఎఫ్ అధ్యక్షుడు పల్లె రవి కుమార్, ట్రైక మాజీ చైర్మన్ రామచంద్ర నాయక్, మరియు పాలమూరు అధ్యయన వేదిక రాఘవా చారి, పౌరహక్కుల సంఘం నారాయణ రావు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాగభూషణం , ప్రజా కళా మండలి జాన్, షోయబ్, సందీప్ రాజ్, దామోదర్ రెడ్డి, లక్ష్మయ్య, సామాజిక వేత్త సజయా, సయీద్ రఫీ సినిమా డైరెక్టర్ , సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్, వైఎం తండా సర్పంచ్ గోవింద్ నాయక్ మరియు జాక్ నాయకులు అబ్దుల్ రాబ్ జామీ, దొడ్డి శ్రీనివాస్, రవీంద్రనాథ్ , అర్జునప్ప , శ్రీనివాస్ రెడ్డి, బాలయ్య, రాంచందర్, నగేష్ , ఆకాష్ నాయక్ , పసుపుల ప్రశాంత్, రాజేందర్ రెడ్డి, శ్రీధర్ చారి, రంజిత,భూక్యా నాయక్,గని మహేష్ , రామదాస్ రవి మరియు సిద్దాపూర్ పరిసర గ్రామ రైతులు , యువకులు పాల్గొన్నారు.





# ఆరోగ్య భద్రతకు సీఎం రిలీఫ్ ఫండ్ పేదల ఆరోగ్యానికి బీఆర్ఎస్ అండ




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ. వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2,00,000/- ఎల్‌ఓసీని జీడిమెట్ల 132వ డివిజన్, జీడిమెట్ల గ్రామానికి చెందిన చీరొల్లి గృతిక్ యాదవ్ కి గుండె జబ్బు రావాడం తో నిమ్స్ హాస్పిటల్ చేరినారు వారి తండ్రికిముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ ఓ సీ పరశురాముకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించి, అవసరమైన సమయంలో అండగా నిలవడమే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ప్రజాసేవ లక్ష్యమని తెలిపారు.ప్రజల కష్టసుఖాల్లో తోడుగాడనిరంతరం ప్రజాసేవలో మమేకమై నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కెపి వివేక నంద సేవలు మరవలేనివి అని కొనియాడారు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు.కుంట సిద్ధిరాములు పేద ప్రజల ఆరోగ్య భద్రతకు అండగా నిలుస్తూ,ద్వారా మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కి ప్రజల తరఫున కృతజ్ఞతలుతెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో భార్య భర్త మృతి

## భర్త రైల్వే ట్రాక్‌పై మృతి, ఆత్మహత్యగా అనుమానం



**తార్నాక,(ప్రజావినికిడి):** లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయపురి కాలనీలో ఓ మహిళ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం విజయపురి కాలనీ, తార్నాకకు చెందిన లక్ష్మి (24), భర్త శరణప్పతో కలిసి నివాసం ఉంటోంది. గురువారం ఆమె ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించింది.

సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతికి అసలు కారణం ఏమిటన్నది నిర్ధారించేందుకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఇదిలా ఉండగా లక్ష్మి భర్త శరణప్ప ఉదయం సమయంలో రైల్వే ట్రాక్‌పై రైలును ఢీకొని మృతి చెందినట్లు సమాచారం.ఈ ఘటనపై రైల్వే పోలీసులు (జి ఆర్ పి) కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.లక్ష్మి మృతిపై ఆమె తల్లిదండ్రులు, బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసే ప్రక్రియ చేపట్టారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ప్రాథమిక దర్యాప్తులో ఆత్మహత్య జరిగి ఉండవచ్చనే అనుమానం వ్యక్తమవుతున్నప్పటికీ,లక్ష్మి మృతికి ఖచ్చితమైన కారణం పోస్టుమార్టం నివేదికతో పాటు పోలీసుల సమగ్ర దర్యాప్తు అనంతరం తేలనుంది. భార్యాభర్తలిద్దరూ కొద్దిసమయంలోనే మృతి చెందడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# అనుముల బ్రదర్స్ భూ దోపిడిపై

# బీఆర్ఎస్ క్షేత్రస్థాయి సందర్శన

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో సందర్శన

## పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు,ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి








**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఫోర్త్ సిటీ (ప్యూచర్ సిటీ) పరిధిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డికి చెందిన సంస్థకు కేటాయించిన భూములను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్,మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలోని ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల బృందం క్షేత్రస్థాయిలో సందర్శించింది.వారికి కేటాయించిన భూమి వద్దే మీడియా ముఖంగా వారు ప్రభుత్వ నిర్ణయాల పట్ల విమర్శలు చేశారు.200 కోట్ల విలువైన 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం 7 కోట్లకే కట్టబెట్టిన స్థలానికి చేరుకున్న బీఆర్ఎస్ బృందం,అక్కడ జరుగుతున్న అక్రమాలను ఎండగట్టారు.ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల కోసం ప్రభుత్వ నిబంధనలను ఎలా తుంగలో తొక్కారో అక్కడి నుంచే వివరించారు. అనుముల బ్రదర్స్ భూ దోపిడీపై ఫైర్:"ముఖ్యమంత్రి అన్నదమ్ములకు నో రూల్స్" అన్నట్లుగా పాలన సాగుతోందని ఖు= మండిపడ్డారు.రూ. లక్ష పెయిడ్-అప్ క్యాపిటల్, కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని ఒక షెల్ కంపెనీకి ఇంత విలువైన రక్షణ రంగ ప్రాజెక్ట్ భూమిని ఎలాకేటాయిస్తారని ప్రశ్నించారు. ఫోర్త్ సిటీ వేదికగా రియల్ ఎస్టేట్ దందాలు: ఫోర్త్ సిటీ అభివృద్ధి పేరుతో ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల భూములను లాక్కొని, వాటిని షెల్ కంపెనీల ముసుగులో తమ సొంత బంధువుల రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు,కోట్ల రూపాయల డీల్స్‌కు వాడుకుంటున్నారని హరీష్ రావు ఆరోపించారు.ప్రభుత్వ భూములను అక్రమంగా దోచిపెడుతున్న ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని,నిరుపేదలు మరియు ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం బీఆర్ఎస్ క్షేత్రస్థాయి పోరాటాలతో పాటు న్యాయపరంగా కూడా ముందుకు వెళ్తుందని నేతలు స్పష్టం చేశారు.

## చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 10(ప్రజావినికిడి**
తెలంగాణ వీనారి చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు ఎల్బీనగర్ లోని చింతల కుంట చెక్ పోస్ట్ లో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద చాకలి ఐలమ్మ ఐక్య వేదిక అధ్యక్షుడు బాతరాజు నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.వివిధ రాజకీయ పార్టీల నాయకులు,రజక సంఘ నాయకులు పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.
నాయకులు మాట్లాడుతూ చింతలకుంట చౌరస్తాను చాకలి ఐలమ్మ చౌరస్థగా నామకరణం చేయాలని ,చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాఠ్యాంశాలలో వారి జీవిత చరిత్రను ప్రచురించాలన్నారు.ప్రతి ఒక్కరు చాకలి ఐలమ్మ ఆశయాలను అందరూ ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారునిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని, భూమికోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం తన జీవిత కాలం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే వర్గాల బతుకులు మారుతాయని తెలిపారు.అమర వీరులు చేసిన పోరాటాలను,త్యాగాలను నేటి తరానికి తెలియ చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సామ రంగారెడ్డి ,వనపల్లి శ్రీనివాస్ రెడ్డి,కొప్పుల నరసింహ రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్,కొప్పుల విటల్ రెడ్డి,జిట్టా రాజశేఖర్ రెడ్డి,ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న,సామిడి శేఖర్ రెడ్డి,కిసరి నర్సిరెడ్డి,వేములయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది: భట్టి విక్రమార్క

తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు.
ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు.
రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు.

# షాద్‌నగర్‌లో "కారు"

# రెండు దారులు!





## నియోజక వర్గాన్నే నమ్ముకున్న అంజయ్య యాదవ్

## రాష్ట్ర రాజకీయాల్లో నవీన్ రెడ్డి దూకుడు..

## ఒకరి అడుగులు రాష్ట్రం వైపు.. మరొకరి చూపు షాద్‌నగర్‌పైనే

## రాబోయే ఎన్నికల్లో అధిష్టానం ఎవరికి అండగా నిలుస్తుంది?

## షాద్‌నగర్ "గులాబీ" ముఖ చిత్రం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ రాజకీయాల్లో కారు గేరు మారినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఆ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఆందోళనలు, ఉద్యమాలను ఉధృతం చేస్తున్న వేళ.. షాద్‌నగర్ నియోజకవర్గంలో మాత్రం రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఒక కారు రెండు దారులు అంటున్నారు రాజకీయ మేధావులు. ఇక్కడ బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు ముఖ్య నేతలు రెండు విభిన్న మార్గాల్లో రాజకీయ ప్రయాణం సాగిస్తున్నారు. ఒకవైపు పాలమూరు ఎమ్మెల్సీ, స్థానిక నేత నాగర్‌కుంట నవీన్ రెడ్డి రాష్ట్రస్థాయి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటుండగా.. మరోవైపు మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ నియోజకవర్గానికే పరిమితమై పార్టీ బలోపేతంపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నారు.

### రాష్ట్ర రాజకీయాల చుట్టూ నవీన్ రెడ్డి..

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలలో గులాబీ బాస్ కేటీఆర్ తో కలిసి చురుకుగా పాల్గొంటున్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో కలిసి పలు నిరసన కార్యక్రమాల్లో ఇటీవల ఆయన ముందుండటం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేయాలనే ఉద్దేశంతో నవీన్ రెడ్డి దూకుడుగా ముందుకు సాగుతున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. అయితే అదే దూకుడు కొన్ని సందర్భాల్లో వివాదాలకు కూడా దారితీస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పోలీసులతో వాగ్వాదాలు, తన, పర భేదం లేకుండా తన ప్రత్యర్థులను ఒకే గాటిన కట్టి ఘాటైన వ్యాఖ్యల వంటి అంశాలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. గతంలోనూ సర్పంచ్ ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల నేతలతో పాటు సొంత పార్టీ అంజయ్య యాదవ్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపిన సందర్భాలు ఉన్నాయని బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ సాగింది.
అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో సహా తన పార్టీకే చెందిన అంజయ్య యాదవ్ ను కూడా టార్గెట్ చేసి గతంలో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. ఏకంగా కేటీఆర్ కల్పించుకొని ఎవరిని చేసిన షాద్ నగర్ గడ్డ అంజయ్య అడ్డా అంటూ తీర్చి పారేశారు. అంజయ్య పై విమర్శలు చేసిన నవీన్ రెడ్డి ఏం చేయాలో తెలియక అప్పట్లో సైలెంట్ అయిపోయారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ఆయన మరో వ్యూహాన్ని ప్రదర్శించి ఏకంగా కేటీఆర్ వెంట రాష్ట్రస్థాయిలో ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. తాజాగా అసెంబ్లీ గేటు వద్ద జరిగిన వివాదాల్లో నవీన్ రెడ్డి ఇదే దూకుడు ప్రదర్శించి ప్రభుత్వం దృష్టిలో పడ్డారు. అంతేకాదు నవీన్ రెడ్డి పై రెండు కేసులు నమోదయ్యాయి. ఎమ్మెల్సీని దూషించిన వ్యవహారంలో తాతా మధుతో కలిసి ఒక కేసు అదేవిధంగా అసెంబ్లీ గేటు వద్ద జరిగిన వివాదంలో మరో కేసు కేటీఆర్ తో కలిసి మరొక కేసు అతనిపై నమోదయింది. రాజకీయాలు దూకుడు స్వభావం ఉన్న నవీన్ రెడ్డి భవిష్యత్తులో కూడా ఇదే దూకుడు ప్రదర్శిస్తే రాజకీయంగా ఏమవుతుందో తెలియదు కానీ కొంత ఇబ్బందికర పరిస్థితిలో ఎదురవుతాయని విశ్లేషకులు అంటున్నారు.
నవీన్ రెడ్డి అనుసరిస్తున్న దూకుడు రాజకీయ శైలి ఆయనకు భవిష్యత్తులో రాజకీయంగా కలిసొస్తుందా? లేక ప్రతికూల ప్రభావం చూపుతుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### అంజన్న రూటే వేరు..

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రాజకీయ శైలి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రాజకీయాలకు మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉంటూ విధానాలపై విమర్శలు చేయడం తన రాజకీయ శైలిగా కొనసాగిస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. గతంలో ఎమ్మెల్యేగా, పార్టీ బాధ్యతల్లో ఉన్న సమయంలోనూ ఆయన ప్రధానంగా షాద్‌నగర్ నియోజకవర్గంపైనే దృష్టి సారించారు. అందుకే ఆయనను ప్రజలు రెండు పర్యాయాలు ఆదరించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సాదాసీదా రాజకీయాలను నడిపారు. ప్రస్తుతం కూడా రాష్ట్రస్థాయి ఆందోళనల కంటే నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడం, పార్టీ ఉనికిని బలోపేతం చేయడంపైనే అంజన్న ఎక్కువగా దృష్టి పెడుతున్నట్లు కనిపిస్తోంది.
అధికార పార్టీపై రాజకీయ పోరాటం కొనసాగిస్తూనే.. స్థానికంగా పార్టీ శ్రేణులను ఏకం చేయడమే తన మార్గంగా అంజయ్య యాదవ్ ముందుకు సాగుతున్నారు. ఆయనకు కుమారుడు రవీందర్ యాదవ్ కూడా రాజకీయంగా సహకరిస్తూ చురుకుగా పనిచేస్తుండటం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.
సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న అంజన్న రాజకీయాల స్టైల్ వేరు. చేసే పని పక్కాగా ఉంటుంది. వివాదారహితుడిగా ఆయనకు నియోజకవర్గం లో మంచి పేరుంది. ఎదుటివారు తనను తిట్టిపోసిన తిరిగి అర్థవంతమైన విమర్శ తప్ప తిరిగి తిట్టే స్వభావం ఆయనది కాదు. నియోజకవర్గ రాజకీయాల్లో ఓడిపోయినా పార్టీలో ప్రజల్లో ఇంకా గట్టి పట్టు పెంచుకున్న అంజయ్య యాదవ్ పైనే బిఆర్ఎస్ అధిష్టానం ఆధారపడి ఉంది అన్నది జగద్వితం. అందుకే నవీన్ రెడ్డి గతంలో ఆయనను పేరు పెట్టి తిట్టిన విమర్శించినా కేవలం అధిష్టానానికి ఫిర్యాదు చేశారే తప్ప పార్టీ క్రమశిక్షణ తప్పకుండా విలువలకు తాను ఎప్పుడు తిలోదకాలు ఇవ్వలేదు. తన స్వంత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి అంజయ్య యాదవ్ వర్గాలకు మధ్య ఘర్షణ జరిగినా అధిష్టానం అంజయ్య వైపే నిలవడం కోసం మెరుపు.

### ఒకరి ప్రయాణం రాష్ట్రం వైపు.. మరొకరి ప్రయాణం నియోజకవర్గం వైపు!

నవీన్ రెడ్డి రాష్ట్రస్థాయి రాజకీయాల్లో చురుకుగా కనిపిస్తుంటే.. అంజయ్య యాదవ్ మాత్రం తన నియోజకవర్గంలో పార్టీకి బలమైన పునాది ఏర్పాటు చేసుకోవడంపైనే దృష్టి సారిస్తున్నారు. ఇద్దరి లక్ష్యం పార్టీ బలోపేతమే అయినా.. అందుకు ఎంచుకున్న మార్గాలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. ఈ పరిణామాలను పరిశీలిస్తున్న రాజకీయ వర్గాలు మాత్రం పురాణాల్లోని వినాయకుడు, కుమారస్వామి కథను గుర్తు చేసుకుంటున్నాయి. ప్రపంచాన్ని చుట్టి రావడానికి కుమారస్వామి వేగంగా బయలుదేరితే.. వినాయకుడు మాత్రం తన తల్లిదండ్రులే తన ప్రపంచమని భావించి వారి చుట్టూ ప్రదక్షిణలు చేసి విజయం సాధించిన కథ తెలిసిందే. అదే విధంగా ఒకరు రాష్ట్ర రాజకీయాల చుట్టూ చురుగ్గా తిరుగుతుంటే.. మరొకరు తన నియోజకవర్గాన్నే రాజకీయ ప్రపంచంగా భావించి అక్కడే పార్టీని బలోపేతం చేసే పనిలో ఉన్నారు. భవిష్యత్తు ఎవరిది ఈ ఇద్దరి పొలిటికల్ గేమ్ లో అసలు ప్రశ్న ఇప్పుడు ఇదే. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ అధిష్టానం ఎవరికి ప్రాధాన్యత ఇస్తుంది? రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్న నవీన్ రెడ్డికా? లేక నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ స్థానికంగా బలాన్ని పెంచుతున్న అంజయ్య యాదవ్‌కా? రాజకీయాల్లో ఎవరి ప్రయాణం సరైనదో కాలమే నిర్ణయిస్తుంది. రాష్ట్ర రాజకీయాల్లో దూకుడుగా ముందుకు సాగుతున్న నవీన్ రెడ్డి ప్రయాణం ఒకవైపు.. షాద్‌నగర్ నియోజకవర్గానికే ప్రాధాన్యతనిస్తూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్న అంజయ్య యాదవ్ ప్రయాణం మరోవైపు..ఇద్దరి రాజకీయ మార్గాలు చివరకు ఎక్కడ కలుస్తాయి? రాబోయే ఎన్నికల్లో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుంది? షాద్‌నగర్ రాజకీయాల్లో 'కారు' ఏ దారిలో ముందుకు వెళ్తుంది? అన్నది తేలాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే..!

## ఏపీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు& భువనేశ్వరి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు.. పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బక్కని..





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలుగుదేశం పార్టీ టిడిపి జాతీయ అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు భువనేశ్వరి గార్ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా నేడు జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలిపిరి ఘటన అనంతరం పునర్జన్మ ప్రసాదించిన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామినీ కుటుంబ సమేతంగా దర్శించుకున్న నారా చంద్రబాబు నాయుడు భువనేశ్వరి దంపతులు,అ పుణ్య దంపతులు జీవితాంతం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని,వారి వివాహ వార్షికోత్సవ దినోత్సవం సందర్భంగా జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆ పుణ్య దంపతులకు పేరు మీద అర్చన చేసి,ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసచార్యుల దంపతులకు చంద్రబాబు నాయుడు భువనేశ్వరీ పేరు మీద పట్టు వస్త్రాలను అందజేసిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే,టిడిపి జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు.కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ చల్ల వెంకటేశ్వరెడ్డి,సాయి ఈశ్వర్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు గంధం ఆనంద్, కందూరి అంజయ్య గౌడ్, రాంభూపాల్,ఏ భాస్కర్ రెడ్డి,ఎస్.భూపతి రెడ్డి, ఆర్.వీరేష్,బక్కని కృష్ణయ్య,నాగులపల్లి అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మద్యం కేసులో రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**మద్యం కుంభకోణం తీవ్ర ఆర్థిక నేరమన్న సుప్రీంకోర్టు**

**ఈడీతో పాటు రాష్ట్ర విచారణ బృందాల దర్యాప్తు సమాంతరంగా సాగడంలో తప్పు లేదని వ్యాఖ్య**

**బెయిల్ పిటిషన్ ను తిరస్కరించిన ధర్మాసనం**

**అమరావతి సెప్టెంబర్ 10,(ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సర్వోన్నత న్యాయస్థానంలో తీవ్ర విఘాతం ఎదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారు దాఖలు చేసిన పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ సందర్భంగా కేసు తీవ్రతను ప్రస్తావించిన సీజేఐ... ఇది తీవ్రమైన ఆర్థిక నేరమని వ్యాఖ్యానించారు.
ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన ఆర్థిక అక్రమాల కేసుతో పాటు రాష్ట్ర పోలీసుల ప్రత్యేక విచారణ బృందాల (సిట్, సీఐడీ) దర్యాప్తు ఒకే సమయంలో సమాంతరంగా సాగడంలో తప్పులేదని కోర్టు తేల్చిచెప్పింది. నిందితులు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నారని న్యాయవాదులు తెలుపగా... ఈడీ కస్టడీ పూర్తయిన తక్షణమే సిట్ కస్టడీకి అప్పగించేలా ప్రొడక్షన్ వారెంట్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించింది.
ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం... సిట్ విచారణ ప్రక్రియ ముగిసిన అనంతరం నిందితులు సంబంధిత కింది కోర్టులోనే రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. కేసుకు సంబంధించిన అంశాలు, మెరిట్స్ ఆధారంగా మాత్రమే ఆ బెయిల్ దరఖాస్తును కింది కోర్టు పరిశీలిస్తుందని స్పష్టం చేసింది.

# దుష్ప్రచారాలు నమ్మొద్దు

**గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదన్న రంగనాథ్**

**సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని వెల్లడి**

**అన్ని చెరువులు, జలాశయాల్లో నిమజ్జనాలు యథావిధిగా సాగుతాయని స్పష్టీకరణ**



హైదరాబాద్,(ప్రజావినికిడి): మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.
కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు.నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.
హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# బాదం పాలు పేరుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?

**FSSAI ముద్ర లేకుండా విక్రయాలు?లితయారీ, -గడువు తేదీలు లేకుండానే బాదం పాలు!**

**చిట్టి నాయుడు పులావ్ హోటల్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు తక్షణ తనిఖీలు నిర్వహించాలి**






**నాగోల్,(ప్రజావినికిడి):**
ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన హోటళ్లలో ఆహార భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిట్టి నాయుడు పులావ్ హోటల్‌లో ప్రజలు తాగే బాదం పాలపై FSSAI వివరాలు, తయారీ తేదీ (Manufacturing Date), గడువు తేదీ (EIpiry Date) వంటి కీలక వివరాలు కనిపించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజలు నేరుగా వినియోగించే ఆహార పదార్థాలపై వాటి తయారీ, గడువు తదితర వివరాలు స్పష్టంగా ఉండటం వినియోగదారుల భద్రతకు అత్యంత కీలకం. అలాంటి వివరాలు లేకుండా బాదం పాలు విక్రయిస్తున్నట్లయితే, అవి ఏ పదార్థాలతో తయారు చేస్తున్నారు? ఎప్పుడు తయారు చేశారు? ఎంతకాలం వరకు వినియోగానికి సురక్షితం? అనే అనుమానాలు వినియోగదారుల్లో వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల తనిఖీలు ఎప్పుడు?**

ఈ వ్యవహారంపై సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు తక్షణమే స్పందించి చిట్టి నాయుడు పులావ్ హోటల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. బాదం పాలతో పాటు హోటల్‌లో తయారు చేసి విక్రయిస్తున్న ఇతర ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, పరిశుభ్రత, లైసెన్స్ వివరాలు, లేబులింగ్ తదితర అంశాలను కూడా సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.
ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు శాంపిల్స్ సేకరించి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యం**

హోటళ్లలో ఆహారం తీసుకునే వినియోగదారులు తాము తీసుకుంటున్న పదార్థాల నాణ్యత, భద్రతపై నమ్మకంతో ఉంటారు.ఆ నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా నిబంధనల ఉల్లంఘనలు జరిగితే సంబంధిత శాఖలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.
బాదం పాలు పేరుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం జరుగుతోందన్న ఆరోపణలపై అధికారులు వెంటనే దృష్టి సారించి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.
ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి

# సహజ సిద్ధంగా ఏర్పడిన వాగును విధ్వంసం చేస్తే ఎలా..?

**కాపాడాల్సిన అధికారులే భక్షకులుగా మారారా..?**

**ఎలికట్ట సర్వే నంబర్ 71లో అక్రమ నిర్మాణాలపై మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఫైర్.!**

**వాగులో నిర్మాణ స్థలానికి పరిశీలించిన తహసిల్దార్ నాగయ్య..**



టవర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే,తహసిల్దార్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
సహజ సిద్ధంగా ఏర్పడిన పాటు కాల్వలను పరిరక్షించాల్సిన అధికారులే వాటి విధ్వంసానికి కారణమవుతున్నారంటూ షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రకృతి ప్రసాదించిన నీటి వనరులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని,వాటిని ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలతో ధ్వంసం చేస్తే భవిష్యత్‌లో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**ఎలికట్టలో వాగుపై నిర్మాణాలు..**

ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులోని సర్వే నంబర్ 71లో సహజ సిద్ధంగా ఏర్పడిన (వాగుకు) అడ్డుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో బక్క నర్సింలు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.అక్కడి పరిస్థితులను పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి,సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

**డైలీ సీరియల్‌లా చర్చలు.. పరిష్కారం ఎక్కడ?**

కాల్వకు సంబంధించిన సమస్యపై గత రెండు రోజులుగా అధికారుల స్థాయిలో చర్చలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యకు పరిష్కారం లభించడం లేదని నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం చర్చలకే పరిమితం కాకుండా సంబంధిత అధికారులు వెంటనే రంగంలోకి దిగి కాల్వను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

**ఐదు చెరువులకు నీటి ప్రవాహం..**

ఎలికట్టలోని ఈ సహజ కాల్వ ద్వారా ఐదు చెరువులకు నీరు చేరుతుందని నరసింహులు పేర్కొన్నారు.ఇలాంటి కీలకమైన నీటి ప్రవాహ మార్గాన్ని నిర్మాణాలతో అడ్డుకుంటే వర్షపు నీటి సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడటమే కాకుండా, భవిష్యత్‌లో చెరువులకు నీరు చేరక నీటి కొరత తలెత్తే ప్రమాదం ఉందన్నారు.దీని ప్రభావం రైతులపై తీవ్రంగా పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి**

సహజ కాల్వలను కాపాడాల్సిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నరసింహులు కోరారు. కాల్వకు అడ్డుగా చేపడుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాల్వను వెంటనే పునరుద్ధరించి, భవిష్యత్‌లో ఎలాంటి ఆక్రమణలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

**సమస్య తీరకపోతే... గ్రామస్తులతో కలిసి ఆందోళనకు సిద్ధం: బక్కని..**

సహజ నీటి వనరులను కాపాడటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భారీ స్థాయిలో ఆందోళన చేపడతామని బక్కని నరసింహులు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ఈఈ వివరణ కోరిన బక్కని నరసింహులు .**

ఈ అంశంపై చేవెళ్ల ఈఈ రవికుమార్‌ను నరసింహులు వివరణ కోరారు.సర్వే నంబర్ 71లో





జరుగుతున్న నిర్మాణాలు, కాల్వకు వాటి వల్ల కలిగే ప్రభావంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.సహజ కాల్వల పరిరక్షణపై అధికారులు తీసుకోనే చర్యలే భవిష్యత్‌లో రైతుల నీటి అవసరాలను కాపాడగలరని బక్కని నరసింహులు అన్నారు

# వందేమాతరంపై కాంగ్రెస్ వర్సెస్ నేషనలిస్ట్ కాంగ్రెస్..

**శ్రీనగర్ సెప్టెంబర్ 10,(ప్రజావినికిడి):**
జమ్ముకాశ్మీర్‌లో అధికారంలో ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్ కూటమిలో విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. 'వందేమాతరం' గీతాలాపన విషయంలో తలెత్తిన ఈ వివాదం, కూటమిలోని ఆధిపత్య పోరుకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
ఇటీవల శ్రీనగర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆయన తండ్రి ఫరూక్ అబ్దుల్లా కేంద్ర ప్రభుత్వ నూతన నిబంధనల మేరకు ఆరు చరణాల పూర్తి 'వందేమాతరం' గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో గౌరవసూచకంగా నిలబడ్డారు. అయితే, దీనిపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. 1937 నాటి పార్టీ తీర్మానం ప్రకారం వందేమాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని,



మిత్రపక్షాలు కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించారు.
కాంగ్రెస్ సూచనను నేషనల్ కాన్ఫరెన్స్ తోసిపుచ్చింది. పార్లమెంటు చట్టం ప్రకారం జాతీయ గీతాలను గౌరవించడం తమ రాజ్యాంగబద్ధమైన విధి అని, దీనికి పార్టీల సిద్ధాంతాలతో సంబంధం లేదని ఎన్సీ అధికార ప్రతినిధి తన్వీర్ సాదిక్ స్పష్టం చేశారు.
అయితే, ఈ రెండు పార్టీల మధ్య వివాదం కేవలం వందేమాతర గీతానికి పరిమితం కాలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎన్సీ 42 స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ కేవలం 6 స్థానాలకే పరిమితమైంది. దీంతో కూటమిలో తమదే పైచేయి అని నిరూపించుకునేందుకు ఎన్సీ ప్రయత్నిస్తోంది.
గతంలో కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారం, రాష్ట్ర హోదాపై ఆందోళనలు, రాజ్యసభ సీట్ల కేటాయింపు వంటి అంశాల్లోనూ ఉభయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 1987లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం వల్ల తమ ప్రాంతీయ అస్తిత్వం దెబ్బతిన్నదనే భావన ఎన్సీ శ్రేణుల్లో బలంగా ఉంది. ఈ చారిత్రక కారణాల వల్లే కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ఎన్సీ నాయకత్వం గట్టిగా వ్యతిరేకిస్తున్నట్లు కనిపిస్తోంది.

# ఢిల్లీతో కలిసి బెస్ట్ ర్యాంక్ కొట్టిన విశాఖ !

**ఢిల్లీ సెప్టెంబర్ 10,(ప్రజావినికిడి):**
దేశ రాజధాని ఢిల్లీతో పోటీ పడడమే కాదు బెస్ట్ ర్యాంక్ ని విశాఖపట్నం అందుకుంది. దేశ రాజధానితో సమానంగా విశాఖ పెర్ఫార్మెన్స్ చేయడం ఇక్కడ విశేషం. ఏ విషయంలో అంటే కాలుష్య నియంత్రణలో. పకడ్బందీగా చర్యలు తీసుకుని విశాఖ దేశంలోనే మంచి ర్యాంక్ ని అందుకుంది. అలాగే ఢిల్లీ తో కలసి 21వ ర్యాంక్ ని సాధించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో ఢిల్లీ విశాఖ 21వ ర్యాంక్ ని కలిసి పంచుకున్నాయి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకులలో విశాఖ ఈ విధంగా ఇంట్రెస్టింగ్ రిజల్ట్ ని సాధించింది
స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకులలో లక్నోకు అగ్ర స్థానం దక్కింది. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో నంబర్ వన్ గా నిలిచింది. అలాగే ఇండోర్ రెండో స్థానంలో ఉంటే 195 పాయింట్లతో జబల్‌పూర్ మూడో స్థానంలో ఉంది. ఇక ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గత ఏడాది ఢిల్లీ 32వ స్థానంలో ఉంది. అయితే ఈసారి ఢిల్లీ తన ర్యాంకును మరింతగా మెరుగుపరుచుకోవడం విశేషంగా పేర్కొంటున్నారు. దేశంలో చూస్తే ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో ఉంటే పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి.



### ఈ ర్యాంకుల కథ ఏంటి :

ఏమిటీ ర్యాంకులు వీటి వెనక కథ ఏంటి అంటే ఈ ర్యాంకులు అందుకున్న నగరాల్లో కాలుష్యం పూర్తిగా తొలగిపోయింది అని కాదు, అయితే కాలుష్యం విషయంలో ఈ నగరాలు తీసుకుంటున్న కీలక చర్యలు, రోడ్లపై దుమ్ము ధూళీ లేకుండా సక్రమంగా ఉంచడం, పేరుకుపోకుండా ఘన వ్యర్థాల తొలగింపు, వాహనాల ద్వారా పరిశ్రమల ద్వారా వెదజల్లే ఉద్గారాలను వీలైనంత మేరకు తగ్గింపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, కాలుష్యం మీద ప్రజలలో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకులను జాతీయ స్థాయిలో ప్రకటిస్తారు. ఈ నగరాలలో గాలి నాణ్యత తక్కువగా ఉండొచ్చు అయితే కాలుష్య నియంత్రణ చర్యలు బలంగా అమలు అవుతున్నందువల్ల ఏదో నాటికి నాణ్యమైన గాలి ఆ నగరాలకు దక్కుతుందని అంటున్నారు. జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తోంది.

### ఢిల్లీని స్ఫూర్తిగా :

నిజానికి ఢిల్లీ అంటేనే కాలుష్యం అని చెబుతారు. శీతాకాలంలో అయితే ఢిల్లీలో ఎవరూ ఉండలేని పరిస్థితి తలెత్తుతుంది. విపరీతంగా వచ్చే పొగమంచు అలాగే విషపూరితమైన గాలి ఉన్నప్పటికీ ఢిల్లీ కాలుష్యాన్ని నియంత్రించేందుకు తీసుకున్న చర్యలు గొప్పగా ఉన్నాయని అంటున్నారు. దీని వల్ల ఢిల్లీ ఏదో నాటికి కాలుష్యం కోరల నుంచి బయట పడుతుంది అని అంటున్నారు. అలా పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. ఇక విశాఖ విషయం తీసుకుంటే అంతకంతకు ఈ నగరంలోనూ కాలుష్యం పెరిగిపోతోంది. అయితే దానిని నిరోధించేందుకు సరైన సమగ్రమైన చర్యలు చేపడుతూ విశాఖ కూడా దీ బెస్ట్ అనిపించుకుంటోంది. అందుకే మంచి ర్యాంక్ ని పొందింది అని అంటున్నారు.

# గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి వెల్లువెత్తిన పెట్టుబడులు

**ఆగస్టులో గోల్డ్ ఈటీఎఫ్ పెట్టుబడులలో 67 శాతం వృద్ధి**

**దేశీయంగా బంగారం ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం**

**సిప్ పెట్టుబడులు రూ. 32,297 కోట్లతో సరికొత్త ఆల్-టైమ్ రికార్డు**

**ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి కొనసాగిన నిధుల ప్రవాహం**

**ఢిల్లీ సెప్టెంబర్ 10 ,(ప్రజావినికిడి):**
దేశీయంగా బంగారం ధరలు పరుగులు పెడుతుండటంతో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే పసిడి వైపు భారీగా మొగ్గు చూపుతున్నారు. దీని ఫలితంగా 2026 ఆగస్టు నెలలో గోల్డ్ ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్లలోకి (ఈటీఎఫ్) పెట్టుబడులు వెల్లువెత్తాయి. జులైతో పోలిస్తే ఆగస్టులో ఏకంగా 67 శాతం వృద్ధితో రూ. 2,596.70 కోట్ల నికర పెట్టుబడులు వచ్చినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) నేడు విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
జులై నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి రూ. 1,559 కోట్ల పెట్టుబడులు రాగా, ఆగస్టులో ఈ ప్రవాహం మరింత పెరిగింది. ఆగస్టు నెలలో 'మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్' (ఎంసీఎక్స్)లో బంగారం ధర సుమారు 7.7 శాతం పెరగడమే ఈ పెట్టుబడుల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. వరుసగా మూడో నెల కూడా గోల్డ్ ఈటీఎఫ్‌లు సానుకూల వృద్ధిని నమోదు చేయడం, బంగారం ఆధారిత




పెట్టుబడి సాధనాలపై ఇన్వెస్టర్లకు పెరుగుతున్న ఆసక్తిని సూచిస్తోంది. బంగారం బాటలోనే వెండి ఈటీఎఫ్‌లు కూడా ఆగస్టులో రూ. 1,270.63 కోట్ల నికర పెట్టుబడులను ఆకర్షించాయి.

### కొనసాగిన ఈక్విటీల జోరు.. రికార్డు సృష్టించిన సిప్‌లు

ఒకవైపు బంగారంపై పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి కూడా నిధుల ప్రవాహం బలంగా కొనసాగింది. మార్కెట్ ఒడుదొడుకులు ఉన్నప్పటికీ, యాక్టివ్‌గా నిర్వహించే ఈక్విటీ పథకాలలోకి ఆగస్టులో నికరంగా రూ. 29,328.62 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జులైలో వచ్చిన రూ. 24,697.39 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 19 శాతం అధికం.
అదే సమయంలో రిటైల్ ఇన్వెస్టర్ల నమ్మకానికి ప్రతీకగా నిలిచే 'సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్' (సిప్) పెట్టుబడులు మరోసారి సరికొత్త రికార్డును సృష్టించాయి. ఆగస్టులో సిప్ ద్వారా వచ్చిన పెట్టుబడులు రూ. 32,297 కోట్లకు చేరాయి. జులైలో ఈ మొత్తం రూ. 31,961 కోట్లుగా ఉంది. సిప్ పెట్టుబడులు నిలకడగా పెరగడం మ్యూచువల్ ఫండ్లపై చిన్న మదుపర్ల విశ్వాసానికి అద్దం పడుతోంది.

### డెట్ ఫండ్ల నుంచి నిధుల తరలింపు

గోల్డ్, ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు పెరిగినప్పటికీ, మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోకి వచ్చిన నికర పెట్టుబడులు ఆగస్టులో గణనీయంగా తగ్గాయి. ఆగస్టులో పరిశ్రమలోకి నికరంగా రూ. 41,353.60 కోట్లు మాత్రమే రాగా, జులైలో ఇది ఏకంగా రూ. 2.35 లక్షల కోట్లుగా నమోదైంది. ఇందుకు ప్రధాన కారణం డెట్ ఫండ్ల విభాగంలో జరిగిన భారీ మార్పులే.

# మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరడంతో బొత్స సత్యనారాయణ భావోద్వేగం

**చీపురుపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కంటతడి పెట్టిన బొత్స**

**వ్యక్తులు వస్తుంటారు పోతుంటారు, పార్టీనే శాశ్వతమంటూ కేడర్‌కు ధైర్యం**



**చీపురుపల్లి సెప్టెంబర్ 10 ,(ప్రజావినికిడి):**
వైసీపీ సీనియర్ నేత, ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన మేనల్లుడు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) టీడీపీలో చేరడంపై స్పందిస్తూ ఆయన కంటతడి పెట్టారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఈ ఉద్విగ్నభరిత వాతావరణం చోటుచేసుకుంది. చిన్న శ్రీనుతో తనకున్న అనుబంధాన్ని, కార్యకర్తలతో అతనికి ఉన్న సంబంధాలను గుర్తుచేసుకుంటూ బొత్స ఒక్కసారిగా కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సమావేశంలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది. అనంతరం తేరుకున్న ఆయన, కార్యకర్తలకు ధైర్యం నూరిపోశారు. "రాజకీయాల్లో వ్యక్తులు వస్తుంటారు, పోతుంటారు. కానీ పార్టీ శాశ్వతం. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కొందరు పార్టీలు మారుతుంటారు. ఎవరూ అధైర్యపడొద్దు" అని ఆయన పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి ఆశయాల సాధన కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని, తాను, ఇతర సీనియర్ నేతలు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రస్థాయి బాధ్యతల్లో తాను బిజీగా ఉండటంతో జిల్లా, నియోజకవర్గ బాధ్యతలను పూర్తిగా చిన్న శ్రీనుకే అప్పగించానని బొత్స గుర్తుచేశారు. అయితే, కనీసం కార్యకర్తలకు కూడా సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా పార్టీ మారడం అందరినీ షాక్‌కు గురిచేసిందని పలువురు నేతలు అన్నారు.

**లాల్ మందిర్‌ను టార్గెట్ చేశారు.. ఎర్రకోట వద్ద పేల్చారు..**

# ఢిల్లీ బ్లాస్ట్ కేసులో కొత్త కోణం!



**ఢిల్లీ సెప్టెంబర్ 10,(ప్రజావినికిడి):**
దేశ రాజధాని ఢిల్లీని 2025లో కుదిపేసిన ఎర్రకోట సమీపంలోని బాంబు పేలుడు ఘటనలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సంచలన విషయాలను వెల్లడించింది. ఆ దాడిలో ఎర్రకోట అసలు లక్ష్యం కాదని, తీవ్రవాదులు మరొక ప్రదేశాన్ని టార్గెట్ చేశారని తన చార్జిషీట్‌లో పేర్కొంది. కేవలం ట్రాఫిక్ రద్దీ, కట్టుదిట్టమైన భద్రత కారణంగానే ఉగ్రవాదులు తమ ప్రణాళికను చివరి నిమిషంలో మార్చుకున్నారని తెలిపింది. 2025 నవంబర్ 10న జరిగిన ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ, కీలక ఆధారాలను కోర్టుకు సమర్పించింది. దాని ప్రకారం, ఉగ్రవాదుల అసలు లక్ష్యం చాందినీ చౌక్‌లోని ప్రసిద్ధ లాల్ మందిర్ (జైన దేవాలయం). పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని మొదట అక్కడికే తీసుకెళ్లారు. సాయంత్రం 6:37 గంటల సమయంలో వాహనం డ్రైవర్ లాల్ మందిర్ సమీపంలో వాహనాన్ని నిలిపేందుకు ప్రయత్నించినట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయింది. అయితే, ఆ సమయంలో ఆ ప్రాంతంలో విపరీతమైన రద్దీ ఉండటం, పోలీసుల భద్రత ఎక్కువగా ఉండటంతో వారి ప్లాన్ అమలు కాలేదు. అసలు లక్ష్యం వద్ద దాడి సాధ్యపడకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని చారిత్రక ఎర్రకోట వైపు మళ్లించాడు. సుమారు 13 నిమిషాల తర్వాత సాయంత్రం 6:50 గంటలకు, ఎర్రకోటలోని గేట్ నంబర్ 4 సమీపంలో వాహనాన్ని పేల్చివేశాడు. ఈ భయానక ఆత్మాహుతి దాడిలో 11 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలంలో లభించిన ఫోరెన్సిక్, డీఎన్ఏ ఆధారాలు ఈ కేసు దర్యాప్తులో కీలకంగా మారాయి. ఈ ఆధారాలను విశ్లేషించడం ద్వారా వాహనంలో ఉన్న ఆత్మాహుతి దళ సభ్యుడిని గుర్తించినట్లు ఎన్ఐఏ తన చార్జిషీట్‌లో పొందుపరిచింది. సీసీటీవీ ఫుటేజీ, శాస్త్రీయ ఆధారాలు ఈ ఉగ్రకుట్రను ఛేదించడంలో దర్యాప్తు సంస్థకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ చార్జిషీట్ ప్రస్తుతం కొనసాగుతున్న విస్తృత దర్యాప్తులో ఒక భాగం మాత్రమేనని, దాడి వెనుక ఉన్న పెద్ద కుట్రను ఛేదించే పనిలో ఉన్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం ఢిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో భద్రతను గణనీయంగా కట్టుదిట్టం చేశారు. కేవలం ట్రాఫిక్ కారణంగా ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెను ప్రమాదం నుంచి బయటపడటం గమనార్హం.

# సభలో రీల్స్, ఫొటోషూట్లు వద్దు..

**నా దవడ ఎముక విరిగింది నిజమే: విజయ్ వ్యాఖ్యలకు స్టాలిన్ కౌంటర్**

**మీసా చట్ట సమయంలో తన అరెస్ట్ పై విజయ్ వ్యాఖ్యలను తప్పుబట్టిన స్టాలిన్**

**అసెంబ్లీని రీల్స్ చేసే స్థలంగా మార్చవద్దని హితవు**

**జైల్లో పోలీసులు చేసిన గాయాలు ఇప్పటికీ తన శరీరంపై ఉన్నాయని వ్యాఖ్య**



**చెన్నై సెప్టెంబర్ 10,(ప్రజావినికిడి):**
తమిళనాడు శాసనసభ వేదికగా ఎమర్జెన్సీ కాలం నాటి 'మీసా' చట్టం, తన అరెస్టుపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ చేసిన వ్యాఖ్యలు, ఆయన శారీరక అభినయంపై డీఎంకె అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. శాసనసభను రీల్స్ చేసే స్థలంగా మార్చవద్దని, అనవసరమైన వివాదాలు రేపకుండా ముఖ్యమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాలని ఆయన హితవు పలికారు. సభలో విజయ్ తన దవడపై చెయ్యి వేసి చూపించిన సైగపై స్పందిస్తూ... జైలులో పోలీసులు జరిపిన దాడిలో తన దవడ ఎముక విరిగిపోవడం నిజమేనని, ఆ గాయాల మచ్చలు నేటికీ తన శరీరంపై ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1976 జనవరి 31న నాటి కరుణానిధి ప్రభుత్వాన్ని కేంద్రం రద్దు చేసిన మరుక్షణమే, గోపాలాపురం ఇంట్లో ఉన్న తనను అరెస్టు చేసేందుకు పోలీసులు వచ్చారని స్టాలిన్ గుర్తుచేశారు. ఆ సమయంలో తాను ప్రచారంలో ఉండటంతో, "మా అబ్బాయి రేపు రాగానే నేనే స్వయంగా ఫోన్ చేసి పిలుస్తాను" అని కరుణానిధి పోలీసులకు చెప్పి, మరుసటి రోజు తనను జైలుకు పంపారని తెలిపారు. రాజకీయాన్ని డైవర్ట్ చేయడానికి విజయ్ చరిత్రను తవ్వే ప్రయత్నం చేస్తున్నారని స్టాలిన్ విమర్శించారు. మీసా నిర్బంధంలో తనతో పాటు ఉన్న ఎంపీ చిట్టిబాబు జైలులోనే ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఈ త్యాగాలు డీఎంకె రక్తం, భావజాలంలో భాగమని, వాటిని ఎవరూ చెరిపివేయలేరని అన్నారు. ప్రభుత్వం కట్టిన వంతెనలపై ఫొటోషూట్లు చేస్తూ, రీల్స్ పోస్ట్ చేస్తూ సినిమా షూటింగ్‌లా పాలన సాగిస్తున్నారని, తమ పరిపాలనా వైఫల్యాలను దాచడానికే విజయ్ ఇటువంటి వివాదాలను లేవనెత్తుతున్నారని స్టాలిన్ ఎద్దేవా చేశారు.




# సూర్య సీన్ మారింది.

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు. ఇటీవల విశ్వనాథ్ అండ్ సన్స్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన.. ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్టుతో సిద్ధమవుతున్నారు. ఆ సినిమాకు సీన్ అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు. రోమాంచం, ఆవేశం వంటి చిత్రాలను తెరకెక్కించిన మాలీవుడ్ డైరెక్టర్ జీతూ మాధవన్ ఆ సినిమాను రూపొందిస్తున్నారు. లేటెస్ట్ గా టైటిల్ ను అఫీషియల్ గా ప్రకటిస్తూ మూవీ టీమ్ టీజర్ ను రిలీజ్ చేసింది. ఇప్పటివరకు సూర్య 47గా పిలుస్తున్న ఆ సినిమాకు సీన్ అనే టైటిల్ ను ఫిక్స్ చేస్తున్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిని నిజం చేస్తూ మేకర్స్ అఫీషియల్ అనౌన్స్మెంట్ చేశారు. విడుదలైన టైటిల్ టీజర్ లో సూర్య లుక్ మెయిన్ అట్రాక్షన్ గా నిలిచింది. షార్ట్, టీషర్ట్ లో సరికొత్త మేకోవర్ లో కనిపించిన ఆయన.. స్టైలిష్ గా ఎంట్రీ ఇచ్చారు. జైలులో ఖైదీల మధ్య నుంచి ఓ పోలీస్ అధికారి భుజంపై చేయి వేసుకుని సూర్య నడుచుకుంటూ వచ్చే సీన్ అందరినీ ఆకట్టుకుంటోంది.టీజర్ ను చూస్తుంటే సూర్య ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా సీన్ సినిమాలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. జీతూ మాధవన్ స్టైల్ కు తగ్గట్టుగా మాస్ యాక్షన్ తో పాటు కామెడీకి కూడా ఇంపార్టన్స్ ఉండనున్నట్లు సమాచారం. ముఖ్యంగా సూర్య రోల్ చుట్టూ ఉండే సీన్స్ సినిమాపై హైప్ పెంచుతున్నాయి. అయితే స్టోరీ, రోల్స్ కు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం మూవీ టీమ్ ప్రస్తుతానికి వెల్లడించలేదు. సినిమాలో సూర్యకు జోడీగా మాలీవుడ్ బ్యూటీ నజ్రియా నజీమ్ నటిస్తోంది. ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైన యాక్టర్ నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సూర్య, జ్యోతికకు చెందిన 2డీ ఎంటర్టైన్మెంట్ ఆ చిత్రాన్ని నిర్మిస్తోంది. సినిమాకు మరో స్పెషాలిటీ మ్యూజిక్. మలయాళంలో తనదైన మ్యూజిక్ తో ఆకట్టుకుంటున్న సుశిన్ శ్యామ్ ఆ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. జీతూ మాధవన్ గత చిత్రాలైన రోమాంచం, ఆవేశం సినిమాలకు కూడా సుశిన్ శ్యామ్ మ్యూజిక్ అందించారు.

# 'ఎపిక్' దాదాపు నా జీవిత కథే..

## కానీ ఆ ఒక్కటి జరగలేదు: ఆనంద్ దేవరకొండ



యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆనంద్ దేవరకొండ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా దాదాపు తన జీవిత కథేనని, కేవలం ఒక్క విషయం మినహా మిగతావన్నీ తన నిజ జీవితంలో జరిగిన సంఘటనలేనని ఆయన వెల్లడించారు."నేను ఒక బాధ్యత గల నటుడిని. నేను ఎంచుకునే కథలు కూడా అదే రీతిలో ఉంటాయి. ఈ సినిమా వాస్తవ జీవితానికి అద్దం పడుతుంది. ప్రేమ, కుటుంబం, బాధ్యతలు వంటి అంశాల మేళవింపుగా సాగే ఈ చిత్రం హీరో-విలన్ల మధ్య నడిచే కథ కాదు.. ఇదొక అందమైన ప్రయాణం," అని ఆయన పేర్కొన్నారు. తాను అమెరికాలో చదువుకున్నప్పటి అనుభవాలకు, లండన్ నేపథ్యంలో సాగే ఈ కథకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయని తెలిపారు. "విదేశాల్లో కుటుంబానికి దూరంగా ఉంటూ, ఆర్థిక సమస్యలను అధిగమించి స్థిరపడాలనుకునే ఎంతోమంది యువతకు ఈ కథ కనెక్ట్ అవుతుంది. సినిమాలో హీరో ఓ అమ్మాయితో కలిసి నివసిస్తాడు. నా నిజ జీవితంలో ఆ ఒక్కటి మినహా, మిగిలినదంతా నా కథే" అని ఆనంద్ వివరించారు.

లివ్-ఇన్ రిలేషన్‌షిప్ నేపథ్యం ఉన్నప్పటికీ, దర్శకుడు ఆదిత్య హాసన్ ఎక్కడా ఇబ్బందికరంగా లేకుండా, కుటుంబ ప్రేక్షకులు సైతం వీక్షించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారని ఆయన భరోసా ఇచ్చారు. సాధారణంగా ఇంట్లో సినిమా విషయాలు పెద్దగా చర్చించుకోమని, అయితే తన సోదరుడు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తనకు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఇటీవల తనకు, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాకు వారు వాచీలను బహుమతిగా ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ప్రస్తుతం తాను 'తక్షకుడు' అనే మిస్టికల్ థ్రిల్లర్‌లో అంధుడి పాత్రలో నటిస్తున్నానని, అలాగే మరో ఇండో-కొరియన్ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉందని తన భవిష్యత్ చిత్రాల గురించి వెల్లడించారు.



# పవర్ సూట్ లుక్‌లో కియారా అద్వానీ..

బాలీవుడ్ నుంచి పాన్ ఇండియా వరకు తన నటన, అందంతో ఊపేస్తున్న అగ్ర నటి కియారా అద్వానీ, తాజాగా పోస్ట్ చేసిన పవర్ సూట్ పిక్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గ్లామరస్ డ్రెస్సుల్లోనే కాకుండా రాయల్ కార్పొరేట్ లుక్‌లో కూడా తాను బాస్‌లా మెరిసిపోగలనో నిరూపిస్తూ ఆమె ఇచ్చిన పోజులు ఇప్పుడు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. కాన్ఫిడెంట్ లుక్‌తో, ఎలిగెంట్ స్టైల్‌తో ఉన్న ఈ ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.ఆ విశేషాలు చూద్దాం.. తాజా ఫోటోషూట్ కోసం కియారా అద్వానీ వినూత్నమైన బేజ్ కలర్ త్రీ-పీస్ పవర్ సూట్‌ను ఎంచుకుంది. సింగిల్ బ్రెస్ట్ బ్లేజర్, లోపల వి-నెక్‌తో ఉన్న బటన్-డౌన్ వేస్ట్‌కోట్, దానికి తగ్గట్టుగా ఉన్న వైడ్-లెగ్ ట్రౌజర్స్ ధరించి అత్యంత పవర్‌ఫుల్ బాస్ లేడీలా కనిపించింది. ఇక వైట్ కాలర్డ్ షర్ట్, స్లిమ్ టై, మ్యాచింగ్ హీల్స్ జత చేసి బోల్డ్ అండ్ క్లాసీ లుక్‌తో అదరగొట్టింది.





# 'ది ప్యారడైజ్' చిత్రీకరణ పూర్తి..

## నాని కొత్త పోస్టర్ రిలీజ్!

నేచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్' షూటింగ్ పూర్తి చేసుకుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో, ఇండస్ట్రీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర యూనిట్ సినిమా మొత్తం చిత్రీకరణను విజయవంతంగా ముగించినట్లు సమాచారం. ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. అంతకంటే ఒకరోజు ముందుగా, అంటే సెప్టెంబర్ 23న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. గురువారం చిత్ర యూనిట్ నానికి సంబంధించిన ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ పోస్టర్‌లో నాని పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో పీరియడ్ రగ్డ్ లుక్‌లో కనిపిస్తున్నారు. చేతిలో భారీ తుపాకీ పట్టుకుని, తీవ్రమైన చూపులతో ఆకట్టుకుంటున్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన మొబైల్ ఫోన్ నుంచి తీసిన స్క్రీన్‌షాట్‌ను పోస్టర్‌గా విడుదల చేసినట్టు తెలుస్తోంది.ఇప్పటికే విడుదలైన 'ది ప్యారడైజ్' టీజర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. పీడిత ప్రజల తిరుగుబాటు నేపథ్యంలో ఈ సినిమా సాగనుందని టీజర్ స్పష్టం చేసింది. "ఇకపై ఈ నేల ఎవరిది?", "అసహ్యించుకున్న నలుపే మా జెండా.. కాకి మా చిహ్నం" వంటి సంభాషణలు, రక్తపాతంతో కూడిన యాక్షన్ సన్నివేశాలు సినిమా ఎంత తీవ్రంగా ఉండబోతోందో సూచించాయి. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.

వాస్తవానికి ఈ సినిమాను మొదట మార్చి 26న, ఆ తర్వాత ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, పలు కారణాలతో సెప్టెంబర్ 24కి వాయిదా పడింది. ఎట్టకేలకు షూటింగ్ పూర్తి కావడంతో, ఇక ప్రమోషన్ల జోరు పెంచి సినిమాను ప్రేక్షకుల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు యూనిట్ సిద్ధమవుతోంది.




# భర్త సినిమా బ్లాక్‌బస్టర్.. థియేటర్లో కన్నీళ్లు పెట్టుకున్న భార్య!

## 'మండాడి' సినిమా విజయంపై దర్శకుడి భార్య భావోద్వేగభరిత పోస్ట్

సాధారణంగా ఒక సినిమా విజయం సాధిస్తే చిత్ర బృందం మొత్తం ఆనందంలో మునిగిపోతుంది. కానీ, ఆ విజయం వెనుక ఏళ్ల తరబడి పడిన కష్టం, ఎన్నో నిద్రలేని రాత్రులు, లెక్కలేనన్ని అవమానాలు ఉంటే ఆ ఆనందం భావోద్వేగభరితంగా మారుతుంది. తమిళ దర్శకుడు మతిమారన్ పుగళేంది విషయంలో సరిగ్గా ఇదే జరిగింది. ఆయన దర్శకత్వం వహించిన 'మండాడి' చిత్రం గురువారం విడుదలై బ్లాక్‌బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని, ఆయన భార్య, ప్రముఖ లిరిక్ రైటర్ జయశ్రీ మతిమారన్ పెట్టిన ఎమోషనల్ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.తమ కుటుంబ ఫొటోను షేర్ చేస్తూ జయశ్రీ తన ఎక్స్ ఖాతాలో భావోద్వేగభరితమైన నోట్‌ను పంచుకున్నారు. "ఈ రోజు ఏం జరిగిందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఇప్పటికీ కదిలిపోతూనే ఉన్నాను. థియేటర్లో 'మండాడి' చిత్రానికి మీరు చూపిన ప్రేమ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రతి క్షణం మేము కలిసి పడిన కష్టాలు, ఒకరికొకరం అండగా నిలబడిన రోజులు, ప్రతి కష్టాన్ని కలిసి ఎదుర్కొన్న క్షణాలు కళ్ల ముందు మెదిలాయి" అని ఆమె రాశారు."థియేటర్లో నేను ఏడ్చాను. చప్పట్లు కొట్టాను. గట్టిగా అరిచాను. అతడిని కౌగిలించుకున్నాను. ఈ భావోద్వేగాల మధ్య, నాకు చెప్పలేనంత గర్వంగా అనిపించింది. ఓపిక, పట్టుదల, నమ్మకం ఒక మనిషిని ఎంత బలంగా, ఎంత ఉన్నత స్థాయికి తీసుకెళతాయో చెప్పడానికి అతనే నిజమైన ఉదాహరణ. లవ్ యూ మతిమారన్. కష్టాల్లోనూ మనం కలిసి జీవించాం.. ఇప్పుడు ఈ విజయాన్ని, ఆనందాన్ని, ప్రతి అందమైన క్షణాన్ని కలిసి ఆస్వాదిద్దాం" అని ఆమె తన భర్తను ఉద్దేశించి రాసుకొచ్చారు. చివరగా, సినిమాలోని ఒక డైలాగ్‌ను ఉటంకిస్తూ, "పోరాటం నుంచి వేడుక వరకు సాగిన ఈ ప్రయాణం నాకు చాలా ప్రత్యేకం" అని ముగించారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613